# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక

1 దేవుని చిత్తం ద్వారా క్రీస్తు యేసుని అపొస్తలునిగా ఉండడానికి
పిలువబడిన పౌలు, మన సహోదరుడైన సొస్తెనేసు,
2 క్రీస్తు యేసులో పవిత్రపరచబడి పరిశుద్ధ ప్రజలుగా
ఉండడానికి పిలువబడిన వారితో పాటు, మన ప్రభువైన
యేసు క్రీస్తు పేరట ప్రతిచోట ప్రార్థించే కొరింథీలోని దేవుని
సంఘస్థులందరికీ శుభమని చెప్పి వ్రాయునది:
3 మన తండ్రియైన దేవుని నుండి, ప్రభువైన యేసు క్రీస్తు నుండి
మీకు కృపా సమాధానం కలుగును గాక.

## కృతజ్ఞతలు చెల్లించుట

4 క్రీస్తు యేసులో దేవుని కృప మీకు ఇవ్వబడింది కాబట్టి మీ కోసం
నా దేవునికి ఎల్లప్పుడు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.
5 దేవుడు క్రీస్తు గురించి మా సాక్ష్యాన్ని మీ మధ్య స్థిరపరస్తున్నారు
కాబట్టి,
6 మీరు ఆయనలో సమస్త జ్ఞానంలోను సమస్త ఉపదేశంలోను
ఐశ్వర్యవంతులు అయ్యారు.
7 కాబట్టి మీరు ఏ కృపావరంలో లోటు లేకుండా మన ప్రభువైన
యేసు క్రీస్తు ప్రత్యక్షత కోసం ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.
8 ఆ దేవుడే మన ప్రభువైన యేసు క్రీస్తు ప్రత్యక్షపరచబడే
రోజున, మీరు నిరపరాధులుగా ఉండాలని అంతం వరకు మిమ్మల్ని
స్థిరపరుస్తారు.
9 తన కుమారుడు మన ప్రభువైన యేసు క్రీస్తు సహవాసానికి
మిమ్మల్ని పిలిచిన దేవుడు నమ్మదగినవాడు.

## నాయకులను బట్టి సంఘంలో విభేదాలు

10 సహోదరీ సహోదరులారా,* మీ మధ్య భేదాలు లేకుండ మీ
మనస్సులోను ఆలోచనలోను పరిపూర్ణ ఏకత్వంతో ఉండాలని మన
ప్రభువైన యేసు క్రీస్తు పేరట నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను.
11 నా సహోదరీ సహోదరులారా, మీలో కలహాలు ఉన్నాయని క్లోయె
ఇంటివారిలో కొందరు నాకు తెలియజేశారు.
12 నేను చెప్పేది ఏంటంటే: మీలో "నేను పౌలును
అనుసరిస్తున్నానని" ఒకరు, "నేను అపొల్లోను అనుసరిస్తున్నానని"
వేరొకరు, "నేను కేఫాను† అనుసరిస్తున్నానని" మరొకరు, "నేను
క్రీస్తును అనుసరిస్తున్నానని" మరి ఇంకొకరు చెప్పుకుంటున్నారని
విన్నాను.
13 క్రీస్తు విభజింపబడి ఉన్నాడా? పౌలు మీ కోసం సిలువ
వేయబడ్డాడా? మీరు పౌలు పేరట బాప్తిస్మం పొందారా?
14-15 నా పేరట బాప్తిస్మం పొందామని మీరు ఎవరూ
చెప్పుకోకూడదని క్రిస్పుకు గాయికు తప్ప మరి ఎవరికీ నేను బాప్తిస్మం
ఇవ్వనందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాను.
16 అవును! స్తెఫెను ఇంటివారికి బాప్తిస్మం ఇచ్చాను, దానికి మించి
ఎవరికి కూడా బాప్తిస్మం ఇచ్చినట్టు నాకు గుర్తులేదు.
17 ఎందుకంటే, క్రీస్తు నన్ను బాప్తిస్మం ఇవ్వడానికి పంపలేదు
కానీ, క్రీస్తు సిలువ తన శక్తి కోల్పోకుండా ఉండాలని, జ్ఞానంతో
వాక్చాతుర్యంతో కాకుండ సువార్తను ప్రకటించడానికే ఆయన నన్ను
పంపించారు.

## సిలువవేయబడిన క్రీస్తే దేవుని శక్తి జ్ఞానము

18 ఎందుకంటే సిలువను గురించిన సువార్త నశించేవారికి
పిచ్చితనంగా ఉంది, కానీ రక్షించబడే మనకు అది దేవుని శక్తి.
19 దీని గురించి వాక్యంలో ఇలా వ్రాయబడి ఉంది,

---

* **1:10** దేవుని కుటుంబానికి చెందిన స్త్రీ పురుషులైన విశ్వాసులకు వర్తిస్తుంది. † **1:12** అంటే, పేతురును

"జ్ఞానుల జ్ఞానాన్ని నాశనం చేస్తాను;
వివేకవంతుల తెలివిని వ్యర్థం చేస్తాను."‡

20 జ్ఞాని ఎక్కడ? ధర్మశాస్త్ర బోధకుడు ఎక్కడ? ఈ కాలపు
పండితుడు ఎక్కడ? ఈ లోక జ్ఞానాన్ని దేవుడు వెర్రితనంగా చేశాడు
కదా?
21 దేవుని జ్ఞానం ప్రకారం, లోకం తన జ్ఞానంతో దేవునిని
తెలుసుకోలేదు. సువార్తను ప్రకటించే వెర్రితనం ద్వారా నమ్మినవారిని
రక్షించడం దేవునికి ఇష్టమైనది.
22 యూదులు సూచనలు అడుగుతారు, గ్రీసు దేశస్థులు జ్ఞానం
కోసం వెదుకుతారు.
23 అయితే మేము సిలువవేయబడిన క్రీస్తునే ప్రకటిస్తున్నాం:
ఆయన యూదులకు ఆటంకంగా యూదేతరులకు వెర్రితనంగా
ఉన్నారు.
24 అయితే యూదులలో గ్రీసు దేశస్థులలో దేవునిచే పిలువబడిన
వారికి క్రీస్తు దేవుని శక్తిగా, దేవుని జ్ఞానంగా ఉన్నారు.
25 ఎందుకంటే, దేవుని వెర్రితనం మనుష్యుల జ్ఞానం కంటే
జ్ఞానవంతమైనది, దేవుని బలహీనత మనుష్యుల బలం కంటే
బలమైనది.
26 సహోదరీ సహోదరులారా, మిమ్మల్ని పిలిచినప్పుడు మీరు ఎలా
ఉన్నారో ఆలోచించండి. లోకపు దృష్టిలో మీలో చాలామంది జ్ఞానులు
కారు, ఘనులు కారు, గొప్ప వంశంలో పుట్టిన వారు కారు.
27 అయితే, జ్ఞానులను సిగ్గుపరచడానికి లోకంలోని
బుద్ధిహీనులను దేవుడు ఎన్నుకున్నారు; బలవంతులను
సిగ్గుపరచడానికి లోకంలోని బలహీనులను దేవుడు ఎన్నుకున్నారు.
28-29 ఎవరూ దేవుని ముందు తనను తాను హెచ్చించుకోకుండా
ఉండడానికి, ఎన్నికచేయబడిన వారిని వ్యర్థం చేయడానికి

‡ **1:19** యెషయా 29:14

ఈ లోకంలో నీచమైన వారిని, నిర్లక్ష్యం చేయబడిన వారిని,
తృణీకరించబడిన వారిని దేవుడు ఏర్పరచుకున్నారు.
30 దేవుడు చేసిన కార్యాలను బట్టి మీరు క్రీస్తు యేసులో ఉన్నారు.
ఇప్పుడు క్రీస్తే దేవుని ద్వారా మనకు జ్ఞానంగా ఉన్నారు అనగా ఆయనే
మన నీతిగా, పరిశుద్ధతగా, విమోచనగా ఉన్నారు.
31 కాబట్టి, "గర్వించేవారు ప్రభువులోనే గర్వించాలి"§ అని
వ్రాయబడి ఉంది.

# 2

1 సహోదరీ సహోదరులారా నేను మీ దగ్గరకు వచ్చినప్పుడు
వాక్చాతుర్యంతో గాని మానవ తెలివితేటలతో గాని దేవుని మర్మాన్ని
మీకు ప్రకటించలేదు.
2 నేను మీతో ఉన్నప్పుడు సిలువవేయబడిన యేసు క్రీస్తు తప్ప మరి
దేని గురించి తెలియజేయకూడదని నిర్ణయించుకున్నాను.
3 నేనైతే బలహీనతలో, అధిక భయంతో వణుకుతో మీ దగ్గరకు
వచ్చాను.
4-5 మీ విశ్వాసం మనుష్యుల జ్ఞానం మీద కాకుండా దేవుని శక్తి మీదే
ఆధారపడాలని, నా మాటలు నా బోధలు జ్ఞానంతో వాక్చాతుర్యంతో
కాకుండా పరిశుద్ధాత్మ శక్తితో నిండి ఉన్నాయి.

## ఆత్మ వలన దేవుని జ్ఞానం బయలుపరచబడింది

6 అయితే పరిపూర్ణులైనవారి మధ్యలో మేము జ్ఞానాన్ని
బోధిస్తున్నాము. అది ఈ యుగసంబంధమైన జ్ఞానం కాదు,
వ్యర్థమైపోయే ఈ లోక అధికారుల జ్ఞానం కాదు.
7 అయితే, మేము దేవుని జ్ఞానాన్ని ప్రకటిస్తున్నాము. అది ఈ లోకం
ఉనికిలోనికి రాకముందే, దేవుడు రహస్యంగా మన ఘనత కోసం
దాచియుంచిన మర్మం.

§ **1:31** యిర్మీయా 9:24

8 దీని గురించి ఈ యుగానికి చెందిన లోకాధికారులలో ఎవరికి
తెలియలేదు. అది వారికి తెలిసి ఉంటే వారు మహిమా స్వరూపియైన
ప్రభువును సిలువ వేసి ఉండేవారు కారు.
9 అయితే దీని గురించి:
"ఎవరూ చూడని
ఎవరూ వినని
ఏ మనుష్యుని మనస్సు ఊహించనివాటిని*
దేవుడు తనను ప్రేమించేవారి కోసం సిద్ధపరచారు"
అని వ్రాయబడి ఉంది.
10 ఈ విషయాలను దేవుడు తన ఆత్మ ద్వారా మనకు
తెలియజేశారు.
ఆత్మ అన్నిటిని, దేవుని లోతైన సంగతులను కూడ పరిశోధిస్తుంది.
11 ఎందుకంటే ఒకరి మనస్సులోని ఆలోచనలు వారికి తప్ప మరి
ఎవరికి తెలుస్తాయి? అలాగే దేవుని మనస్సులో ఉన్న ఆలోచనలు
దేవుని ఆత్మకే గాని మరి ఎవరికి తెలియవు.
12 దేవుడు మనకు అనుగ్రహించిన వాటిని తెలుసుకోవడానికి,
మనం ఈ లోక ఆత్మను కాకుండా దేవుని నుండి వచ్చిన ఆత్మనే
పొందుకున్నాము.
13 మానవ జ్ఞానం మాకు నేర్పే మాటలతో కాకుండా, ఆత్మ నేర్పించిన
మాటలతోనే మేము మాట్లాడుతున్నాం, ఆ మాటలతోనే ఆత్మీయ
సత్యాలను వివరిస్తున్నాము.
14 అయితే ప్రకృతి సంబంధులైన వారు దేవుని ఆత్మ నుండి
వచ్చిన వాటిని అంగీకరించలేరు, వాటిని కేవలం ఆత్మ ద్వారానే
గ్రహించగలం కాబట్టి, అవి వారికి వెర్రితనంగా అనిపిస్తాయి; వారు
వాటిని గ్రహించలేరు.
15 ఆత్మను అనుసరించి నడుచుకొనేవారు అన్నిటి గురించి
వివేచిస్తారు కాని వారు ఎవరిచేత వివేచించబడరు.
16 ఎందుకంటే,
"ప్రభువు మనస్సును తెలుసుకున్న వారెవరు?

* **2:9** యెషయా 64:4

ఆయనకు బోధింప గలవారెవరు?”†
మనమైతే క్రీస్తు మనస్సును కలిగి ఉన్నాము.

# 3

### సంఘం, దాని నాయకులు

1 సహోదరీ సహోదరులారా, ఆత్మ సంబంధులైన వారితో
మాట్లాడినట్లు మీతో నేను మాట్లాడలేకపోయాను. ఎందుకంటే మీరు
ఇంకా ఈ లోక సంబంధులుగానే జీవిస్తూ క్రీస్తులో పసిబిడ్డలుగానే
ఉన్నారు.
2 మీరు బలమైన ఆహారాన్ని తినడానికి సిద్ధంగా లేరు కాబట్టి నేను
మీకు పాలు ఇచ్చాను. ఇప్పుడు కూడా మీరు దానికి సిద్ధంగా లేరు.
3 మీరు ఇంకా లోకస్థులుగానే ఉన్నారు. మీలో అసూయ,
కొట్లాటలు ఉన్నాయి. కాబట్టి మీరు శరీర స్వభావంతో సాధారణ
మానవుల్లా జీవించడం లేదా?
4 మీలో, “నేను పౌలును అనుసరిస్తున్నాను” అని ఒకరు,
“నేను అపొల్లోను అనుసరిస్తున్నాను” అని ఇంకొకరు చెప్పుకుంటూ
ఉన్నప్పుడు మీరు సాధారణ మానవుల్లా లేరా?
5 అపొల్లో ఎవరు? పౌలు ఎవరు? కేవలం సేవకులే కదా!
ఒక్కొక్కరికి ప్రభువు నియమించిన దాని ప్రకారం, వారి ద్వారా మీరు
విశ్వాసంలోనికి వచ్చారు.
6 నేను విత్తనం నాటాను, అపొల్లో దానికి నీళ్లు పోశాడు, అయితే
వృద్ధి కలుగచేసింది దేవుడే.
7 కాబట్టి నాటేవారిలో కానీ, నీళ్లు పోసేవారిలో కానీ గొప్పతనం ఏమి
లేదు, కానీ దేవుడే దానిని వృద్ధి చేయగలరు.
8 నాటేవారు, నీళ్లు పోసేవారు ఒకే ఉద్దేశం కలిగి ఉన్నారు. ప్రతి
ఒక్కరు తాను చేసిన కష్టానికి తగిన ప్రతిఫలాన్ని పొందుతారు.

† **2:16** యెషయా 40:13

9 కాబట్టి మేము దేవుని సేవలో జతపనివారము: మీరు దేవుని
పొలంగా దేవుని కట్టడంలా ఉన్నారు.
10 దేవుడు నాకు అనుగ్రహించిన కృపను బట్టి నేను తెలివైన
నిర్మాణకునిగా పునాది వేశాను. అలాగే మరొకరు దాని మీద
కడుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కట్టాలి.
11 ఎందుకంటే అప్పటికే వేయబడిన పునాది తప్ప మరొకటి ఎవరూ
వేయలేరు, ఆ పునాది యేసు క్రీస్తే.
12 ఎవరైనా ఈ పునాది మీద బంగారం, వెండి, వెలగల రాళ్లు,
చెక్క, ఎండుగడ్డి లేదా గడ్డి లాంటి వస్తువులతో కడితే,
13 ఆ న్యాయ దినాన వారు చేసిన పని వెలుగులో స్పష్టంగా
కనబడుతుంది. అది అగ్నిచేత నిరూపించబడుతుంది, అందరి
పనిలోని నాణ్యత అగ్నిచేత పరీక్షించబడుతుంది.
14 పునాది మీద కట్టిన పని ఎవరిది నిలుస్తుందో, వారు జీతాన్ని
పొందుతారు.
15 అది కాల్చి వేయబడితే దానిని కట్టిన వారికి నష్టం కలుగుతుంది
కానీ వారు తప్పించుకుంటారు. అయితే అది కేవలం మంటల్లో నుండి
తప్పించుకున్నట్టుగా ఉంటారు.
16 మీరు దేవుని ఆలయమై ఉన్నారని, దేవుని ఆత్మ మీలో
నివసిస్తుందని మీకు తెలియదా?
17 ఎవరైనా దేవుని మందిరాన్ని పాడు చేస్తే, దేవుడు వారిని
పాడుచేస్తారు. ఎందుకంటే దేవుని మందిరం పరిశుద్ధమైనది.
మీరందరు కలిసి ఆ ఆలయమై ఉన్నారు.
18 మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. ఈ లోకరీతిగా, మీలో
ఎవరైనా నేను జ్ఞానినని అనుకుంటే, వారు జ్ఞాని అవ్వడానికి
"బుద్ధిలేనివారిగా" కావాలి.
19 ఎందుకంటే ఈ లోక జ్ఞానం దేవుని దృష్టిలో వెర్రితనము.
లేఖనాల్లో: "జ్ఞానులను వారి యుక్తిలోనే ఆయన పట్టుకుంటారు"*

* **3:19** యోబు 5:13

అని వ్రాయబడి ఉంది.
20 లేఖనాల్లో ఇంకొక చోట: "జ్ఞానుల ఆలోచనలు వ్యర్థమైనవి అని
దేవునికి తెలుసు"† అని వ్రాయబడి ఉంది.
21 కాబట్టి ఎవరు మనుష్యులను బట్టి గర్వించకూడదు. అన్ని మీకు
చెందినవే.
22 పౌలు అయినా, అపొల్లో అయినా, కేఫా అయినా, లోకమైనా,
జీవమైనా, మరణమైనా, ఇప్పుడు ఉన్న వాటిలోనైనా, రాబోయే
వాటిలోనైనా అన్ని మీకు చెందినవే.
23 మీరు క్రీస్తుకు చెందినవారు, క్రీస్తు దేవునికి చెందినవారు.

# 4

## నిజమైన అపొస్తలత్వం యొక్క స్వభావం

1 అందుచేత, క్రీస్తు సేవకులుగా దేవుని మర్మాలను తెలియజేసే
బాధ్యత పొందినవారిగా మమ్మల్ని మీరు భావించాలి.
2 ఆ బాధ్యతను పొందినవారు నమ్మకమైనవారిగా
రుజువుపరచుకోవటం చాలా అవసరము.
3 మీ చేత గాని ఇతరులచేత గాని నేను తీర్పు తీర్చబడటం నాకు
చాలా చిన్న విషయము. నిజానికి, నన్ను నేనే విమర్శించుకోను.
4 నా మనస్సాక్షి నిర్దోషమైనది, అయినా నేను నిర్దోషి అని కాదు
నన్ను తీర్పు తీర్చేది ప్రభువే.
5 అందుకే నిర్ణీత సమయం రాకముందే తీర్పు తీర్చవద్దు, ప్రభువు
వచ్చేవరకు ఆగాలి. చీకటిలో దాచబడిన రహస్యాలను వెలుగులోకి
తెచ్చి హృదయంలోని ఉద్దేశాలను ఆయనే బయటపెడతారు.
ఆ సమయంలో ప్రతి ఒక్కరు దేవుని నుండి తమ ఘనతను
పొందుకొంటారు.
6 సహోదరీ సహోదరులారా, "వ్రాయబడిన వాటిని మించి
వెళ్లవద్దు" అని చెప్పబడిన మాట భావాన్ని మా నుండి మీరు
నేర్చుకోగలిగేలా, మీకు మేలు కలుగడానికి ఈ విషయాలను

† **3:20** కీర్తన 94:11

నా గురించి అపొల్లో గురించి ఉదాహరణగా చెప్పాను. అప్పుడు మమ్మల్ని అనుసరించే వారిగా మీరు ఒకరిపై ఒకరు అతిశయపడకుండా ఉంటారు.
7 ఇతరులకంటే నిన్ను ప్రత్యేకంగా చేసేది ఎవరు? ఇతరుల నుండి
నీవు పొందనిది నీ దగ్గర ఏమి ఉంది? నీవు ఇతరుల నుండి పొంది కూడా పొందని వానిలా గొప్పలు చెప్పుకోవడం ఎందుకు?

8 ఇప్పటికే మీకు కావలసినవన్ని మీరు కలిగి ఉన్నారు! మీరు
ధనవంతులైయ్యారు! మేము లేకుండానే మీరు పరిపాలించడం ప్రారంభించారు! మేము కూడా మీతో కలిసి పరిపాలించేలా మీరు నిజంగా పరిపాలించడం నాకు సంతోషమే!
9 దేవుడు అపొస్తలులమైన మమ్మల్ని మరణశిక్ష విధించబడినవారి
వరుసలో అందరికంటే చివరిగా ఉంచాడని నాకు అనిపిస్తుంది. మేము లోకమంతటికి, దేవదూతలకు అదే విధంగా మనుష్యులకు ఒక వింతగా ఉన్నాము.
10 మేము క్రీస్తు కోసం బుద్ధిహీనులం, కాని మీరు క్రీస్తులో
తెలివైనవారు! మేము బలహీనులం, కాని మీరు బలవంతులు! మీరు గౌరవం పొందారు, మేము అవమానం పొందాం!
11 ఈ సమయం వరకు ఆకలిదప్పులతో అలమటించాము,
చింపిరి గుడ్డలతో ఉన్నాము, క్రూరంగా కొట్టబడ్డాము, నిరాశ్రయులుగా ఉన్నాము.
12 మా చేతులతో కష్టపడి పని చేసుకుంటున్నాము. మమ్మల్ని
శపించినవారిని మేము దీవిస్తున్నాము; మమ్మల్ని హింసించినప్పుడు ఓర్చుకుంటున్నాము,
13 మమ్మల్ని దూషించినప్పుడు, దయతో సమాధానం చెప్తున్నాము.
ఇప్పటివరకు మేము భూమి మీద నీచులుగా, లోకంలో పెంటకుప్పగా ఉన్నాము.

### పౌలు వేడుకోలు, హెచ్చరిక

14 మిమ్మల్ని సిగ్గుపరచాలని కాదు కానీ, నా ప్రియమైన పిల్లలుగా
మిమ్మల్ని హెచ్చరించాలని ఈ మాటలు వ్రాస్తున్నాను.
15 క్రీస్తులో మీకు పదివేలమంది ఉపదేశకులు ఉన్నా, తండ్రులు
అనేకులు లేరు. కాబట్టి క్రీస్తు యేసులో సువార్త ద్వారా నేను మీకు
తండ్రినయ్యాను.
16 కాబట్టి, నన్ను అనుకరించమని మిమ్మల్ని వేడుకుంటున్నాను.
17 ఈ కారణంగా, ప్రభువులో నమ్మకమైనవాడు నేను ప్రేమించే
నా కుమారుడైన తిమోతిని మీ దగ్గరకు పంపాను. ప్రతి సంఘంలో
ప్రతిచోట నేను బోధించిన దానితో ఏకీభవించే యేసు క్రీస్తులో నా జీవన
విధానాన్ని అతడు మీకు జ్ఞాపకం చేస్తాడు.
18 నేను మీ దగ్గరకు రాననుకొని మీలో కొందరు గర్విస్తున్నారు.
19 అయితే, ప్రభువు చిత్తమైతే త్వరలోనే మీ దగ్గరకు వస్తాను.
ఆ గర్విష్ఠులు మాట్లాడే మాటలనే కాకుండా వారికి ఏ శక్తి ఉందో
తెలుసుకుంటాను.
20 దేవుని రాజ్యం అంటే వట్టిమాటలు కాదు అది శక్తితో కూడింది.
21 మీరేది కోరుతున్నారు? నేను మీ దగ్గరకు క్రమశిక్షణ అనే బెత్తంతో
రావాలా? లేదా నేను ప్రేమతో సౌమ్యమైన మనస్సుతో రావాలా?

# 5

## లైంగిక దుర్నీతి విషయంలో చేయవలసినవి

1 మీ మధ్య వ్యభిచారం ఉన్నదని మేము విన్నాము. మీలో ఒకడు
తన తండ్రి భార్యను ఉంచుకున్నాడట కదా! ఇలాంటి వ్యభిచారం
దేవుని ఎరుగనివారు కూడా సహించరు.
2 ఇలా ఉండి కూడా మీరు గర్విస్తున్నారా! నిజానికి ఈ విషయం
గురించి మీరు దుఃఖించి ఈ పని చేసిన వానిని మీ సహవాసం నుండి
వెలివేయాలి కదా!
3 నా మట్టుకైతే, నేను శారీరకంగా మీతో అక్కడ లేకపోయినా నా
ఆత్మలో నేను మీతోనే ఉన్నాను. కాబట్టి మీతో ఉన్న వానిగానే మన

ప్రభువైన యేసు నామంలో ఈ పని చేసిన వాని మీద తీర్పు ఇదివరకే
తెలియజేశాను.
4 ఎలాగంటే, ప్రభు యేసు నామంలో మీరు సమకూడినప్పుడు
ప్రభువైన యేసు శక్తి ద్వారా నేను ఆత్మలో మీతో ఉన్నాను.
5 కాబట్టి ప్రభువు దినాన వాని ఆత్మ రక్షించబడేలా వాని శరీరం
నశించడానికి వానిని సాతానుకు అప్పగించాలి.

6 మీరు ఆ విషయంలో గర్వించడం మంచిది కాదు. పులిసిన పిండి
కొంచెమే అయినా మొత్తం పిండిని పులియజేస్తుందని మీకు తెలుసు
కదా!
7 క్రీస్తు అనే మన పస్కా గొర్రెపిల్ల మీ కోసం వధించబడి ప్రాయశ్చిత్తం
చేశారు కాబట్టి మీరు పులియని క్రొత్త పిండి ముద్దగా ఉండడానికి
పులిసిన పాత పిండిని పారవేయండి.
8 కాబట్టి అసూయ, దుర్మార్గం అనే పులిసిన పాత పిండితో కాకుండా
నిజాయితీ సత్యమనే పులియని రొట్టెతో పస్కా పండుగ ఆచరిద్దాము.

9 లైంగిక దుర్నీతి కలిగినవారితో సహవాసం చేయవద్దని నా
పత్రికలో మీకు వ్రాశాను.
10 అయితే నేను, ఈ లోకపు వ్యభిచారులతో గాని,
అత్యాశపరులతో గాని, మోసం చేసేవారితో గాని, విగ్రహారాధికులతో
గాని ఏమాత్రం కలిసి ఉండవద్దని చెప్పడం లేదు, అలాగైతే మీరు
లోకాన్నే విడిచి వెళ్లవలసి ఉంటుంది కదా!
11 ఇప్పుడైతే, సహోదరి అని సహోదరుడని పిలువబడే
సంఘసభ్యుల గురించి వ్రాస్తున్నాను. ఎవరైనా వ్యభిచారిగా,
అత్యాశపరునిగా, విగ్రహారాధికునిగా లేదా నిందలువేసే వారిగా,
త్రాగుబోతుగా లేదా మోసగానిగా ఉంటే అలాంటి వారితో కలిసి
ఉండవద్దు. అలాంటి వారితో భోజనం కూడా చేయవద్దని మీకు
వ్రాస్తున్నాను.

12 సంఘానికి బయట ఉన్నవారిని విమర్శించడం నాకెందుకు?
మీకు సంఘసభ్యులను తీర్పు తీర్చే బాధ్యత లేదా?

13 సంఘం బయటివారికి దేవుడే తీర్పు తీరుస్తారు. కాబట్టి
వాక్యంలో ఉన్నట్లు, "ఆ దుష్టున్ని మీ మధ్య నుండి వెలివేయండి."*

# 6

## విశ్వాసుల మధ్యలోని తగాదాలు

1 మీలో ఒకరితో ఒకరికి తగాదాలు ఉన్నప్పుడు దానిని పరిశుద్ధుల
ముందుకు వెళ్లడానికి బదులు భక్తిహీనులైనవారి ముందుకు న్యాయం
కోసం దాన్ని తీసుకెళ్తారా?
2 పరిశుద్ధులే ఈ లోకానికి న్యాయం తీర్చుతారని మీకు తెలియదా?
మీరు లోకానికి తీర్పు తీర్చేవారైతే చిన్న చిన్న తగాదాలను మీరు
పరిష్కరించుకోలేరా?
3 మనం దేవదూతలకు తీర్పు తీరుస్తామని మీకు తెలియదా?
అలాంటప్పుడు ఈ లోకసంబంధమైన విషయాలను గురించి మరి
బాగా తీర్పు తీర్చవచ్చు కదా!
4 కాబట్టి ఒకవేళ మీకు ఇలాంటి విషయాల్లో తగాదాలు ఉంటే,
వాటిని పరిష్కరించమని సంఘంలో తిరస్కరించబడిన వారిని
అడుగుతారా?
5 మీరు సిగ్గుపడాలని ఇలా చెప్తున్నాను. విశ్వాసుల మధ్య గల
తగాదాలు తీర్చగల జ్ఞానవంతులు మీలో ఎవరు లేరా?
6 అలా కాకుండా, ఒక సోదరుడు మరొక సోదరున్ని
న్యాయస్థానానికి తీసుకెళ్తున్నాడు, అది కూడా అవిశ్వాసుల ముందు!
7 నిజానికి, మీ మధ్యలో తగాదాలు ఉన్నాయంటే మీరు ముందే
పూర్తిగా ఓడిపోయారని అర్థం కాబట్టి మీరు దోషులుగా లేదా
మోసపోయిన వారిగానే ఉండవచ్చు కాదా?
8 అయితే మీరే మోసం చేస్తున్నారు, తప్పు చేస్తున్నారు, మీ
సహోదర సహోదరీలకు కూడా అలాగే చేస్తున్నారు.

* **5:13** ద్వితీ 13:5; 17:7; 19:19; 21:21; 22:21,24; 24:7

9 తప్పు చేసినవారు దేవుని రాజ్యానికి వారసులు కారని మీకు
తెలియదా? మోసపోకండి: లైంగిక దుర్నీతైనా, విగ్రహారాధికులైనా,
వ్యభిచారులైనా, పురుషులతో లైంగిక సంబంధాలు పెట్టుకొనే
పురుషులైనా,
10 దొంగలైనా, అత్యాశపరులైనా, త్రాగుబోతులైనా, దూషకులైనా,
మోసగించేవారైనా దేవుని రాజ్యానికి వారసులు కాలేరు.
11 మీరు విమోచింపబడక ముందు మీలో కొందరు అలాంటి
వారిగా ఉన్నారు. అయితే ప్రభువైన యేసు క్రీస్తు నామంలో, మన
దేవుని ఆత్మలో మీరు కడుగబడి పవిత్రపరచబడి, నీతిమంతులుగా
తీర్చబడ్డారు.

## లైంగిక దుర్నీతి

12 "ఏది చేయడానికైనా నాకు స్వాతంత్ర్యం ఉందని" మీరు
అనుకోవచ్చు కాని, అన్ని చేయదగినవి కావు. "ఏది చేయడానికైనా
నాకు అనుమతి ఉంది అనుకోవచ్చు" కాని, నేను దేనికి లొంగిపోను.
13 "ఆహారం కడుపు కోసం, కడుపు ఆహారం కోసం
నియమించబడ్డాయని మీరు చెప్తారు, కానీ దేవుడు రెండింటిని
నాశనం చేస్తారు." మీ శరీరాన్ని లైంగిక దుర్నీతి కోసం కాదు గాని
ప్రభువు కొరకే, ప్రభువు శరీరం కొరకే.
14 దేవుడు తన శక్తి వలన ప్రభువును మరణం నుండి సజీవంగా
లేపారు. కాబట్టి ఆయన మనల్ని కూడ అలాగే సజీవంగా లేపుతారు.
15 మీ శరీరాలు క్రీస్తుకు అవయవాలుగా ఉన్నాయని మీకు
తెలియదా? అయితే నేను క్రీస్తు అవయవాలను తీసుకుని వేశ్య
అవయవాలుగా చేస్తానా? అలా ఎన్నడు జరుగకూడదు.
16 వేశ్యతో కలిసేవాడు ఆమెతో ఏక శరీరమై ఉన్నాడని మీకు
తెలియదా? వాక్యంలో, "వారిద్దరు ఏకశరీరం అవుతారు"* అని
వ్రాయబడి ఉంది కదా!

---

* **6:16** ఆది 2:24

17 అయితే ప్రభువుతో ఏకమైనవారు ఆత్మలో ఆయనతో ఒక్కటై ఉంటారు.
18 లైంగిక దుర్నీతికి దూరంగా పారిపోండి. మానవుడు చేసే ఇతర పాపాలన్నీ శరీరానికి బయట చేసేవే, కానీ లైంగిక పాపం చేసేవాడు తన సొంత శరీరానికి వ్యతిరేకంగా పాపం చేస్తున్నాడు.
19 మీ శరీరాన్ని దేవుడే ఇచ్చారు. మీలో ఉన్న పరిశుద్ధాత్మకు శరీరం ఆలయమై ఉందని మీకు తెలియదా? మీరు మీ సొంతం కాదు.
20 మీరు వెలపెట్టి కొనబడ్డారు. కాబట్టి మీ శరీరాలతో దేవుని మహిమపరచండి.

# 7

## దాంపత్య జీవితం గురించి

1 మీరు వ్రాసిన విషయాల గురించి: "స్త్రీతో లైంగిక సంబంధం లేకపోవడం పురుషునికి మంచిది."
2 అయితే లైంగిక దుర్నీతి జరుగుతుంది కాబట్టి ప్రతి పురుషుడు తన సొంత భార్యతోనే, ప్రతి స్త్రీ తన సొంత భర్తతోనే లైంగిక సంబంధం కలిగి ఉండాలి.
3 భర్త తన భార్య పట్ల వైవాహిక బాధ్యతను నెరవేర్చాలి, అదే విధంగా భార్య తన భర్తకు వైవాహిక బాధ్యతను నెరవేర్చాలి.
4 భార్య శరీరం మీద ఆమె భర్తకే గాని ఆమెకు అధికారం లేదు. అలాగే భర్త శరీరం మీద భార్యకే గాని అతనికి అధికారం లేదు.
5 మీరు ఇద్దరు వ్యక్తిగతంగా కొంత సమయం ప్రార్థనలో గడపడానికి పరస్పర అంగీకారంతోనే తప్ప ఒకరిని విడిచి ఒకరు దూరంగా ఉండకండి. మీ మనస్సును మీరు అదుపు చేసుకోలేనప్పుడు సాతాను మిమ్మల్ని శోధించకుండ మీరు తిరిగి కలుసుకోండి.
6 ఇది ఒక సలహా మాత్రమే ఆజ్ఞ కాదు.
7 మీరందరు నాలా ఉండాలని కోరుకుంటున్నాను. కానీ, మీలో ప్రతి ఒక్కరికీ దేవుడు ఒక ప్రత్యేకమైన వరాన్ని ఇచ్చారు; ఒకరికి ఒక వరం, ఇంకొకరికి ఇంకొక వరాన్ని ఇచ్చారు.

8 ఇప్పుడు నేను పెళ్ళికానివారితో, విధవరాండ్రతో చెప్పేది ఏంటంటే:
నాలా వారు కూడ పెళ్ళి చేసుకోకుండా ఉండడం మంచిది.
9 అయితే వారు తమను తాము అదుపు చేసుకోలేకపోతే పెళ్ళి
చేసుకోవాలి. కామంతో రగిలిపోవడం కంటే పెళ్ళి చేసుకోవడం మేలు.

10 పెళ్ళి అయినవారికి నేను కాదు, ప్రభువే ఆజ్ఞాపించేది ఏంటంటే:
భార్య భర్తనుండి వేరుగా ఉండకూడదు.
11 అయితే ఆమె అలా వేరైతే, ఆమె పెళ్ళి చేసుకోకుండా
ఉండిపోవాలి లేదా తన భర్తతో సమాధానపడాలి. అలాగే భర్త తన
భార్యను విడిచిపెట్టకూడదు.

12 మిగిలిన వారితో ప్రభువు కాదు నేను చెప్పేది ఏంటంటే: ఏ
సహోదరునికైనా అవిశ్వాసురాలైన భార్య ఉండి, ఆమె అతనితో కలిసి
కాపురం చేయడానికి ఇష్టపడితే, అతడు ఆమెను విడిచిపెట్టకూడదు.
13 ఏ స్త్రీకైనా అవిశ్వాసియైన భర్త ఉండి ఆమెతో కాపురం
చేయడానికి అతడు ఇష్టపడితే, ఆమె అతన్ని విడిచిపెట్టకూడదు.
14 అవిశ్వాసియైన భర్త, భార్య ద్వారా పరిశుద్ధపరచబడతాడు.
అవిశ్వాసురాలైన భార్య విశ్వాసియైన భర్త ద్వారా
పవిత్రపరచబడుతుంది. లేకపోతే మీ పిల్లలు అపవిత్రులుగా
ఉంటారు, ఇప్పుడైతే వాళ్ళు పవిత్రులు.

15 అయితే అవిశ్వాసి విడిచిపెడితే విడిచిపెట్టవచ్చు. అలాంటి
సందర్భాలలో ఉన్న విశ్వాసులైన సహోదరుడు లేదా సహోదరి
వివాహానికి కట్టుబడి ఉండనవసరం లేదు; సమాధానం కలిగి
జీవించడానికి దేవుడు మనల్ని పిలిచారు.
16 ఓ భార్యా, నీ భర్తను రక్షించగలవో లేదో నీకు ఎలా తెలుసు? ఓ
భర్తా, నీ భార్యను రక్షించగలవో లేదో నీకు ఎలా తెలుసు?

### స్థితిలో మార్పు గురించి

17 ప్రభువు ప్రతిఒక్కరికి ఏ స్థితి నియమించారో, దేవుడు అందరిని
ఏ స్థితిలో పిలిచారో ఆ స్థితిలోనే విశ్వాసిగా జీవించాలి. ఇదే
నియమాన్ని అన్ని సంఘాలకు నియమిస్తున్నాను.
18 అప్పటికే సున్నతి పొందినవాడు పిలువబడ్డాడా? అతడు
సున్నతి పోగొట్టుకోకూడదు. సున్నతి పొందనివాడు పిలువబడ్డాడా?
అతడు సున్నతి పొందకూడదు.
19 సున్నతి పొందడంలో గాని పొందకపోవడంలో ఏమి లేదు.
దేవుని ఆజ్ఞలను పాటించడమే ముఖ్యం.
20 ప్రతి ఒక్కరూ దేవుడు ఏ స్థితిలో తమను పిలిచారో ఆ స్థితిలోనే
ఉండాలి.
21 పిలిచినప్పుడు నీవు దాసునిగా ఉన్నావా? దాని గురించి
బాధపడవద్దు; నీవు స్వాతంత్ర్యం పొందుకోగలిగితే స్వాతంత్ర్యం
పొందుకో.
22 ప్రభువులో విశ్వాసం ఉంచడానికి పిలువబడిన దాసులు,
ప్రభువు వలన స్వాతంత్ర్యం పొందినవారు; అదే విధంగా,
స్వతంత్రునిగా ఉండి పిలువబడిన వారు క్రీస్తుకు దాసులు.
23 మీరు వెలపెట్టి కొనబడ్డారు కాబట్టి మనుష్యులకు దాసులుగా
ఉండకండి.
24 సహోదరీ సహోదరులారా, ప్రతి ఒక్కరిని దేవుడు ఏ స్థితిలో
ఉండగా పిలిచారో ఆ స్థితిలోనే వారు దేవునితో నిలిచి ఉండాలి.

### పెళ్ళికానివారు, విధవరాండ్ర గురించి

25 కన్యల గురించి ప్రభువు నుండి నాకు ఆజ్ఞ లేదు గాని, ప్రభువు
కృప చేత నమ్మకమైన వానిగా నేను ఒక ఆలోచన చెప్తున్నాను.
26 ఇప్పటి క్లిష్ట పరిస్థితిని బట్టి పురుషుడు తానున్న స్థితిలోనే
ఉండడం మంచిదని నేను భావిస్తున్నాను.
27 మీరు ఒక స్త్రీకి ప్రమాణం చేశారా? దాని నుండి విడుదల
కోరవద్దు. మీరు అలాంటి ప్రమాణం నుండి విడుదల పొందారా? భార్య
కోసం వెదకవద్దు.

28 అయితే, మీరు పెళ్ళి చేసుకుంటే అది పాపం కాదు; కన్య
పెళ్ళి చేసుకుంటే అది పాపం కాదు. అయితే పెళ్ళి చేసుకున్న
వారికి జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి, అవి మీకు
కలుగకూడదని నేను కోరుతున్నాను.

29 సహోదరీ సహోదరులారా, నేను చెప్పేది ఏంటంటే, సమయం
తక్కువగా ఉన్నది. కాబట్టి ఇకమీదట భార్యలు కలిగినవారు భార్యలు
లేనట్లు జీవించండి.
30 దుఃఖించే వారు ఏడవనట్టు, సంతోషపడేవారు
సంతోషపడనట్టు, ఏదైనా కొన్నవారు అది తమది కాదన్నట్టు ఉండాలి.
31 ఈ లోక విషయాలతో వ్యవహరించేవారు వాటితో సంబంధం
లేనివారిగా ఉండాలి. ఎందుకంటే ఈ లోకం ఉన్న ప్రస్తుత రూపం
గతించిపోతుంది.
32 మీరు చింతలేనివారై ఉండాలని నేను కోరుకొంటున్నాను.
పెళ్ళికానివారు ప్రభువును ఎలా సంతోషపెట్టగలమా అని ప్రభువు
విషయాల గురించి చింతిస్తారు.
33 అయితే పెండ్లియైన వారు భార్యను ఎలా సంతోషపెట్టగలనా
అని ఈ లోక విషయాల గురించి చింతిస్తున్నారు.
34 పెళ్ళైన వారికి పెళ్ళికాని వారికి మధ్య భేదం ఉంది; పెళ్ళికాని
స్త్రీ లేదా కన్య తాను శరీరంలో, ఆత్మలో పవిత్రంగా ఉండాలని ప్రభువు
కార్యాలను గురించి ఆలోచిస్తుంది. కాని పెళ్ళైన స్త్రీ తన భర్తను ఎలా
సంతోషపెట్టగలనా అనే ఈ లోక విషయాల గురించి ఆలోచిస్తుంది.
35 ఇది మీ మంచి కోసమే తప్ప మిమ్మల్ని ఆటంకపరచాలని కాదు.
అయితే మీరు ఇతర విషయాల మీద ధ్యాస పెట్టకుండా ప్రభువు పైనే
దృష్టి నిలిపి సరియైన మార్గంలో జీవించమని చెప్తున్నాను.

36 ఎవరైనా తనకు నిశ్చయమైన కన్య పట్ల గౌరవంగా
నడుచుకోవడం లేదని బాధపడితే, ఒకవేళ ఆమె వయస్సు
పెరిగిపోవడం వలన పెళ్ళి చేయాలని భావిస్తే, అతడు తాను

కోరుకున్నట్లే చేయాలి. అతడు పాపం చేయడం లేదు. వారు పెళ్ళి
చేసుకోవాలి.
37 అయితే ఎవడైనా కన్యను పెళ్ళి చేసుకోకూడదని
నిర్ణయించుకొని, దానికి తగిన మనోబలం కలిగి ఉండి తన కోరికలను
అదుపులో ఉంచుకునే శక్తి గలవాడైతే అతడు చేసేది కూడా మంచిదే.
38 కాబట్టి ఒకడు కన్యను పెళ్ళి చేసుకున్నా మంచిదే, చేసుకోకపోతే
ఇంకా మంచిది.
39 భార్య తన భర్త బ్రతికి ఉన్నంత వరకు అతనికి కట్టుబడి
ఉండాలి. భర్త చనిపోతే ఆమె తనకిష్టమైన వాన్ని పెళ్ళి
చేసుకోవడానికి స్వతంత్రురాలే కాని, అతడు దేవునికి చెందినవాడై
ఉండాలి.
40 అయితే, ఆమె ఉన్న రీతిగానే ఉంటే, అది ఆమెకు సంతోషంగా
ఉంటుందని నా అభిప్రాయం. నేనయితే దేవుని ఆత్మను కలిగి
ఉన్నాను.

# 8

## విగ్రహాలకు అర్పించబడిన ఆహారం

1 విగ్రహాలకు అర్పించబడిన ఆహారాన్ని గురించి: "మనమందరం
జ్ఞానం కలిగి ఉన్నాం" అని మనకు తెలుసు. అయితే జ్ఞానం
అతిశయపడేలా చేస్తుంది కాని, ప్రేమ అభివృద్ధి కలిగిస్తుంది.
2 ఒకరు తమకు ఏమైనా తెలుసు అనుకుంటే, వారు
తెలుసుకోవలసినంతగా తెలుసుకోలేదని అర్థం.
3 అయితే దేవుని ప్రేమించేవారిని దేవుడు గుర్తిస్తారు.
4 అందుకే, విగ్రహాలకు అర్పించిన వాటిని తినే విషయంలో:
"లోకంలో విగ్రహానికి విలువలేదు, ఒకే ఒక్క దేవుడు తప్ప వేరొక
దేవుడు లేడు" అని మనకు తెలుసు.
5 ఒకవేళ ఆకాశంలో కాని భూమి మీద కాని దేవుళ్ళు అని
పిలువబడే వారు ఉన్నా (నిజానికి చాలామంది "దేవుళ్ళు"
చాలామంది "ప్రభువులు" ఉన్నారు),

6 కానీ మనకైతే ఒక్కడే తండ్రియైన దేవుడు ఉన్నాడు. ఆయన
ద్వారానే అన్ని కలిగాయి. ఆయన ద్వారానే మనం జీవిస్తున్నాం;
అలాగే మనకు యేసు క్రీస్తు ప్రభువు ఒక్కడే, ఆయన ద్వారానే అన్ని
కలిగాయి, ఆయన ద్వారానే మనం జీవిస్తున్నాము.

7 అయితే ఈ జ్ఞానం అందరికి లేదు. కొందరు ఇప్పటికీ
విగ్రహాలను ఆరాధించేవారు తాము తినే పదార్థాలు విగ్రహాలకు బలి
అర్పించినవి అని భావిస్తారు. కాబట్టి వారి మనస్సాక్షి బలహీనమైనదై
అపవిత్రమవుతుంది.
8 అయితే ఆహారం మనల్ని దేవునికి దగ్గరగా తీసుకురాదు;
తినకపోతే మనకు నష్టంలేదు, తినడం వల్ల మనకు లాభం లేదు.

9 అయితే మీకున్న అధికారాన్ని బలహీనులకు అభ్యంతరం
కలిగించకుండ చూసుకోండి.
10 ఎందుకంటే మీకున్న జ్ఞానంతో విగ్రహాలు ఉన్న మందిరంలో నీవు
తినడం బలహీనమైన మనస్సాక్షి కలవారు చూస్తే, వారు విగ్రహాలను
అర్పించిన వాటిని తినడానికి ధైర్యం తెచ్చుకుంటారు కదా?
11 అందువల్ల ఎవరి కోసం క్రీస్తు చనిపోయెనో ఆ బలహీనులైన ఆ
సహోదరీ సహోదరులు నీ జ్ఞానాన్నిబట్టి నశిస్తారు.
12 ఇలా వారికి విరోధంగా పాపం చేసి వారి బలహీనమైన
మనస్సాక్షిని నొప్పించినందుకు మీరు క్రీస్తుకు వ్యతిరేకంగా పాపం
చేస్తున్నారు.
13 కాబట్టి నేను తిన్నదే నా సహోదరీ సహోదరులు పాపంలో
పడడానికి ఒకవేళ కారణమైతే, వారు పాపంలో పడడానికి నేను
కారణం కాకూడదని నేను మళ్ళీ ఎప్పుడు అలాంటి ఆహారాన్ని తినను.

# 9

## అపొస్తలునిగా పౌలుకు గల హక్కులు

1 నేను స్వతంత్రున్ని కానా? నేను అపొస్తలుడను కానా? మన
ప్రభువైన యేసును నేను చూడలేదా? ప్రభువులో నేను చేసిన పనికి
ఫలితం మీరు కారా?
2 ఇతరులకు నేను అపొస్తలుడను కాకపోయినా, మీకు మాత్రం
తప్పక నేను అపొస్తలుడనే! కాబట్టి ప్రభువులో నా అపొస్తలత్వానికి
మీరు ముద్రగా ఉన్నారు.
3 నాపై నిందారోపణ చేసేవారికి నేను చెప్పే సమాధానమిదే.
4 తినడానికి త్రాగడానికి మాకు హక్కు లేదా?
5 మిగతా అపొస్తలుల్లా, ప్రభువు యొక్క సహోదరుల్లా, కేఫాలా
విశ్వాసురాలైన భార్యను మాతో పాటు తీసుకెళ్లడానికి మాకు హక్కు
లేదా?
6 జీవనోపాధి కోసం పని చేయకుండ ఉండడానికి నాకు బర్నబా
మాత్రమే హక్కు లేదా?
7 ఎవరైనా తన సొంత ఖర్చులు పెట్టుకొని సైన్యంలో సేవ చేస్తారా?
ద్రాక్షతోట వేసి దాని పండ్లు తిననివారు ఎవరు? మందను పోషిస్తూ
వాటి పాలు త్రాగనివారు ఎవరు?
8 ఈ మాటలు కేవలం మానవ అధికారంతో చెప్తున్నానా? ధర్మశాస్త్రం
కూడా ఇదే చెప్తున్నది కదా!
9 మోషే ధర్మశాస్త్రంలో, "ఎద్దు ధాన్యాన్ని త్రొక్కుతున్నప్పుడు మూతికి
చిక్కం కట్టవద్దు"* అని వ్రాయబడి ఉంది. దేవుడు ఎద్దులను గురించి
చెప్తున్నారా?
10 ఖచ్చితంగా ఆయన మన కొరకే ఈ మాట చెప్పలేదా? అవును,
ఇది ఖచ్చితంగా మన కొరకే వ్రాయబడింది, ఎందుకంటే పొలాన్ని
దున్నేవారు, త్రొక్కేవారు పంటలో భాగం పొందాలనే ఆశతో పని
చేయాలి.
11 మీ మధ్యలో ఆత్మ సంబంధమైన విత్తనాన్ని మేము నాటితే,
మీ నుండి ఈ లోకసంబంధమైన పంటను మేము కోస్తే అది గొప్ప
విషయమా?

* **9:9** ద్వితీ 25:4

12 మీ నుండి సహాయం పొందడానికి ఇతరులకు హక్కు ఉంటే,
మాకు మరి ఎక్కువ హక్కు ఉండదా?

అయితే, ఈ హక్కును మేము ఉపయోగించుకోలేదు. క్రీస్తు సువార్తకు ఆటంకంగా ఉండకూడదని అన్ని ఇబ్బందులను మేము సహిస్తున్నాము.

13 దేవాలయంలో పని చేసేవారు దేవాలయం నుండే తమ
ఆహారాన్ని పొందుతారని, బలిపీఠం దగ్గర సేవ చేసేవారు బలిపీఠం
మీద అర్పించిన వాటిలో పాలిభాగస్థులని మీకు తెలియదా?
14 అలాగే, సువార్తను ప్రకటించేవారు సువార్త వల్లనే తమ
జీవనోపాధి పొందుకోవాలని ప్రభువు ఆజ్ఞాపించారు.

15 కాని, నేనైతే వీటిలో దేన్ని ఉపయోగించుకోలేదు. నా పట్ల మీరు
ఇలా చేయాలని ఈ సంగతులు వ్రాయడం లేదు. ఈ నా అతిశయాన్ని
ఎవరైనా వట్టిదిగా చేస్తే దానికన్నా నాకు మరణమే మేలు.
16 సువార్త ప్రకటించడం నాకు తప్పనిసరి బాధ్యత కాబట్టి నేను
సువార్త ప్రకటిస్తున్నానని గొప్ప చెప్పుకోలేను. అయ్యో, నేను
సువార్తను ప్రకటించకపోతే నాకు శ్రమ!
17 నేను ఇష్టపూర్వకంగా ప్రకటిస్తే నాకు బహుమానం దొరుకుతుంది.
నాకు నేనుగా కాకపోయినా నామీద నమ్మకంతో నాకు అప్పగించబడిన
పనిని మాత్రమే నేను చేస్తున్నాను.
18 అప్పుడు నా బహుమానం ఏంటి? సువార్తను ప్రకటించేవానిగా
నాకున్న అధికారాన్ని పూర్తిగా ఉపయోగించుకోకుండా సువార్తను
ఉచితంగా ప్రకటించడమే నా బహుమానము.

## పౌలు తన స్వేచ్ఛను ఉపయోగించుకొనుట

19 నేను స్వతంత్రునిగా ఎవరికీ చెందినవాడిగా ఉన్నప్పటికీ,
సాధ్యమైనంత వరకు ఎక్కువమందిని దేవుని కోసం సంపాదించడానికి
నన్ను నేను అందరికి దాసునిగా చేసుకున్నాను.

20 యూదులను సంపాదించడానికి యూదునిలా ధర్మశాస్త్రానికి
లోబడిన వారిని సంపాదించడానికి నేను ధర్మశాస్త్రానికి లోబడిన వాన్ని
కాకపోయినా ధర్మశాస్త్రానికి లోబడిన వానిలా అయ్యాను.
21 ధర్మశాస్త్రం లేనివారిని సంపాదించడానికి నేను ధర్మశాస్త్రం
లేనివారిలో ఒక్కడిని అయ్యాను. దేవుని ధర్మశాస్త్రం నుండి విడుదల
పొందకపోయినా నేను క్రీస్తు ధర్మశాస్త్రం క్రింద ఉన్నాను.
22 బలహీనులను సంపాదించడానికి బలహీనులకు
బలహీనుడనయ్యాను. అన్ని విధాలుగా కొందరినైనా రక్షించాలని
అందరికి అన్ని విధాలుగా ఉన్నాను.
23 సువార్త వల్ల కలిగే ఆశీర్వాదాలలో నేను భాగస్థునిగా ఉండాలని
నేను సువార్త కోసమే వీటన్నిటిని చేశాను.

### స్వీయ క్రమశిక్షణ యొక్క అవసరత

24 పరుగు పందెంలో పాల్గొనే వారందరు పరుగెడతారు కాని, ఒక్కరే
బహుమానం పొందుకుంటారని మీకు తెలియదా? అలాగే మీరు
బహుమానాన్ని పొందాలని పరుగెత్తండి.
25 ఆటలలో పాల్గొనే ప్రతివారు కఠినమైన శిక్షణ తీసుకుంటారు.
వారు నిత్యం ఉండని కిరీటాన్ని పొందడానికి అంత కష్టపడతారు, కానీ
మనమైతే నిత్యం నిలిచే కిరీటం పొందడం కోసం కష్టపడతాం.
26 కాబట్టి, గమ్యంలేని వానిలా నేను పరుగెత్తడం లేదు; గాలిని
కొట్టువానిలా నేను పోరాడడంలేదు.
27 అయితే, ఇతరులకు సువార్త ప్రకటించిన తర్వాత బహుమానం
పొందే అర్హత నేను కోల్పోకుండా ఉండడానికి నా శరీరాన్ని నలగ్గొట్టి,
దాన్ని లోబరచుకొంటున్నాను.

# 10

### ఇశ్రాయేలీయుల చరిత్ర నుండి హెచ్చరికలు

1 సహోదరీ సహోదరులారా, మీరు సత్యం తెలియనివారిగా
ఉండాలని నేను కోరడంలేదు. మన పూర్వికులందరూ మేఘం క్రింద
ఉన్నారు. సముద్రం గుండా ప్రయాణించారు.
2 వారందరు మేఘంలో సముద్రంలో మోషే బట్టి బాప్తిస్మం పొందారు.
3 వారందరు ఒకే ఆత్మీయ ఆహారం తిన్నారు.
4 అందరు ఒకే ఆత్మీయ నీటిని త్రాగారు. ఎందుకంటే తమతో కూడా
ఉన్న ఆత్మీయ బండ నుండి వారు త్రాగారు, ఆ బండ క్రీస్తు.
5 అయినాసరే, వారిలో అనేకమంది దేవున్ని సంతోషపరచలేదు;
కాబట్టి వారి శవాలు అరణ్యంలో చెల్లాచెదురుగా పడ్డాయి.
6 వారిలా మన హృదయాలను చెడ్డ విషయాలపై నిలుపకుండా ఈ
సంగతులు మనకు ఉదాహరణలుగా ఉన్నాయి.
7 వారిలో కొందరిలా మీరు విగ్రహారాధికులుగా ఉండకండి: "ప్రజలు
తినడానికి త్రాగడానికి కూర్చుని ఆడడానికి లేచారు,"* అని వారి
గురించి వ్రాయబడింది.
8 వారిలా మనం లైంగిక దుర్నీతికి పాల్పడకూడదు. వారిలో
కొందరు అలా చేయడం వలన ఒక్క రోజులోనే ఇరవై మూడువేలమంది
చనిపోయారు.
9 వారిలో కొందరు శోధించినట్లుగా మనం క్రీస్తును శోధించకూడదు,
అలా శోధించినవారు సర్పాల వల్ల చనిపోయారు.
10 వారిలా మనం సణుగకూడదు, వారిలో కొందరు సణిగి నాశనం
చేసే దూత వలన చనిపోయారు.
11 మనకు ఉదాహరణలుగా ఉండడానికి ఈ సంగతులు వారికి
సంభవించి, రాబోయే యుగాంతంలో మనకు హెచ్చరికగా ఉండడానికి
వ్రాయబడ్డాయి.
12 కాబట్టి, తాము దృఢంగా నిలిచి ఉన్నామని భావించేవారు
పడిపోకుండా జాగ్రత్తగా ఉండాలి.
13 సాధారణంగా మనష్యులకు కలిగే శోధనలు తప్ప మరి ఏ
ఇతర శోధనలు మీకు సంభవించలేదు. దేవుడు నమ్మదగినవాడు;

* **10:7** నిర్గమ 32:6

మీరు సహించగలిగిన దానికంటే ఎక్కువగా ఆయన మిమ్మల్ని శోధించబడనివ్వడు. కాని మీరు శోధించబడినప్పుడు దానిని సహించడానికి తప్పించుకునే మార్గాన్ని కూడా ఆయనే అందిస్తాడు.

## విగ్రహపు విందులు, ప్రభువు రాత్రి భోజనం

14 కాబట్టి నా ప్రియ స్నేహితులారా, విగ్రహారాధనకు దూరంగా పారిపోండి.
15 నేను తెలివిగల వారితో మాట్లాడుతున్నాను; నేను చెప్పిన దాన్ని మిమ్మల్ని మీరే ఆలోచించండి.
16 మనం కృతజ్ఞతలు తెలియజేయడానికి ఆశీర్వాదపు పాత్రలోనిది త్రాగడం క్రీస్తు రక్తంలో పాలుపుచ్చుకోవడమే కదా? మనం రొట్టె విరిచి తినడం క్రీస్తు శరీరంలో పాలుపంచుకోవడమే కదా?
17 మనమందరం ఆ ఒకే రొట్టెను పంచుకుంటున్నాం, రొట్టె ఒక్కటే కాబట్టి అనేకులమైన మనం ఒకే శరీరంగా ఉన్నాము.
18 ఇశ్రాయేలు ప్రజలారా చూడండి: బలి అర్పించిన వాటిని తిన్నవారు బలిపీఠంలో భాగస్థులు కారా?
19 ఇక నేను చెప్పేది ఏంటంటే, విగ్రహాలకు అర్పించిన ఆహారంలో ఏమైన ప్రత్యేకత ఉందా? విగ్రహం ఏమైన ప్రత్యేకమైనదా?
20 కాదు, అయితే దేవుని ఎరుగనివారు అర్పించే బలులు దేవునికి కాదు దయ్యాలకే అర్పిస్తున్నారు. కాని దేవునికి అర్పించినవి కావు, మీరు దయ్యాలతో భాగస్వాములుగా ఉండకూడదని నా కోరిక.
21 మీరు ప్రభువు పాత్రలోనిది దయ్యపు పాత్రలోనిది ఒకేసారి త్రాగలేరు. ప్రభువు బల్లలో దయ్యపు బల్లలో ఒకేసారి పాల్గొనలేరు.
22 ప్రభువు రోషాన్ని పుట్టించడానికి మనం ప్రయత్నిస్తున్నామా? ఆయన కంటే మనం బలవంతులమా?

## విశ్వాసుల స్వాతంత్ర్యం

23 "ఏది చేయడానికైనా నాకు అనుమతి ఉంది" అని మీరు అనుకోవచ్చు, కాని అన్ని ప్రయోజనకరమైనవి కావు. "ఏది

చేయడానికైనా నాకు హక్కు ఉంది” కాని అన్నీ అభివృద్ధిని
కలిగించవు.
24 ఎవరైనా సరే తమ మంచినే చూసుకోకూడదు ఇతరుల మంచిని
కూడా చూడాలి.

25 మనస్సాక్షిని బట్టి ఏ ప్రశ్నలు వేయకుండా మాంసం దుకాణంలో
అమ్మే దేనినైనా తినవచ్చును.
26 ఎందుకంటే, “భూమి, దానిలో ఉండే సమస్తం ప్రభువుకు
చెందినవే.”†

27 ఒక అవిశ్వాసి మిమ్మల్ని భోజనానికి పిలిచినపుడు మీరు
వెళ్లాలనుకుంటే, మనస్సాక్షిని బట్టి ఏ ప్రశ్నలు వేయకుండా మీ
ముందు ఉంచిన వాటిని తినండి.
28 కాని ఎవరైనా మీతో, “ఇది విగ్రహాలకు అర్పించిన ఆహారం” అని
చెబితే దాన్ని తినవద్దు. మీకు చెప్పినవాని కోసం, మనస్సాక్షి కోసం
దాన్ని తినవద్దు.
29 మీ మనస్సాక్షి గురించి కాదు గాని ఇతరుల మనస్సాక్షి గురించి
నేను ఇలా చెప్తున్నాను, ఎందుకంటే వేరొకరి మనస్సాక్షిని బట్టి నా
స్వాతంత్ర్యం ఎందుకు విమర్శించబడాలి?
30 నేను కృతజ్ఞతతో పాలు పంచుకుంటే నేను దేవునికి కృతజ్ఞతలు
చెల్లించిన దాని కోసం నేనెందుకు నిందించబడాలి?

31 నీవు ఏమి తిన్నా, ఏమి త్రాగినా ఏమి చేసినా వాటన్నిటిని
దేవుని మహిమ కొరకే చేయాలి.
32 యూదులకైనా, గ్రీసు దేశస్థులకైనా, దేవుని సంఘానికైనా మరి
ఎవరికైనా సరే అభ్యంతరంగా ఉండకండి.
33 అలాగే నేను కూడా అందరిని అన్ని విధాలుగా
సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నాను. నా స్వలాభాన్ని ఆశించకుండా,
అనేకమంది రక్షింపబడాలని వారి మంచి కోరుతున్నాను.

† **10:26** కీర్తన 24:1

# 11

1 నేను క్రీస్తు మాదిరిని అనుసరించినట్లే మీరు నా మాదిరిని
అనుసరించండి.

## ఆరాధనలో తలపై ముసుగు ధరించుట

2 మీరు అన్ని విషయాల్లో నన్ను జ్ఞాపకం చేసుకుంటూ, మీకు నేను
మీకు అప్పగించిన సంప్రదాయాలను అలాగే కొనసాగిస్తున్నందుకు
నేను మిమ్మల్ని మెచ్చుకుంటున్నాను.
3 అయితే ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తు అని, స్త్రీకి శిరస్సు
పురుషుడని, క్రీస్తుకు శిరస్సు దేవుడని మీరు గ్రహించాలని నేను
కోరుతున్నాను.
4 కాబట్టి ఏ పురుషుడైనా తన తలమీద ముసుగు
వేసుకుని ప్రార్థించినా లేదా ప్రవచించినా అతడు తన తలను
అవమానిస్తున్నాడు.
5 అయితే ఏ స్త్రీయైనా తలమీద ముసుగు వేసుకోకుండా ప్రార్థించినా
లేదా ప్రవచించినా ఆ స్త్రీ తన తలను అవమానపరుస్తున్నట్టే. అలా చేస్తే
ఆమె తలను క్షౌరం చేసుకున్నట్టే.
6 స్త్రీ తన తలపై ముసుగు వేసుకోకపోతే, తన వెంట్రుకలను
కత్తిరించుకోవాలి. అయితే వెంట్రుకలు కత్తిరించుకోవడం గాని లేదా
తల క్షౌరం చేయించుకోవడం స్త్రీకి అవమానంగా అనిపిస్తే ఆమె తలపై
ముసుగు వేసుకోవాలి.
7 పురుషుడు దేవుని పోలికగా మహిమగా ఉన్నాడు కాబట్టి అతడు
తన తలపై ముసుగు వేసుకోకూడదు; కాని స్త్రీ పురుషునికి మహిమగా
ఉంది.
8 ఎందుకంటే, పురుషుడు స్త్రీ నుండి రాలేదు గాని, స్త్రీ పురుషుని
నుండి వచ్చింది.
9 పురుషుడు స్త్రీ కోసం సృష్టించబడలేదు గాని, పురుషుని కోసం స్త్రీ
సృష్టించబడింది.

10 ఈ కారణంగా, దేవదూతలను బట్టి అధికార సూచన స్త్రీకి తలపై
ఉండాలి.
11 అయితే, ప్రభువులో స్త్రీకి వేరుగా పురుషుడు, పురుషునికి
వేరుగా స్త్రీ ఉండరు.
12 పురుషుని నుండి స్త్రీ ఎలా కలిగిందో, అలాగే పురుషుడు స్త్రీ
నుండి జన్మిస్తున్నాడు. అయితే సమస్తం దేవుని నుండి వచ్చాయి.
13 మీకు మీరే ఆలోచించుకోండి; స్త్రీ తలపై ముసుగు వేసుకోకుండా
దేవునికి ప్రార్థన చేయడం సరియైనదేనా?
14 పురుషునికి పొడవైన వెంట్రుకలు ఉండడం అతనికి
అవమానమని సహజంగా మీకు అనిపిస్తుంది కదా?
15 అయితే స్త్రీకి పొడవైన జుట్టు ఆమె తలను కప్పుకోడానికి
పైటచెంగుగా ఇవ్వబడింది కాబట్టి పొడవైన జుట్టు కలిగి ఉండడం
ఆమెకు గౌరవం కాదా?
16 కాని, ఎవరైనా దీని గురించి వాదించాలనుకుంటే, మనలో గాని
దేవుని సంఘంలో గాని మరి ఏ ఇతర ఆచారం లేదని గ్రహించాలి.

## ప్రభురాత్రి భోజనం యొక్క దుర్వినియోగాన్ని సరిదిద్దుట

17 ఈ ఆజ్ఞలు ఇస్తూ నేను మిమ్మల్ని మెచ్చుకోను, ఎందుకంటే మీ
సమావేశాలు మంచి కంటే చెడునే ఎక్కువగా చేస్తున్నాయి.
18 మొదటి విషయం, మీరు దేవుని సంఘంగా ఒకచోట
చేరినప్పుడు మీలో విభేదాలు ఉన్నాయని నేను విన్నాను. ఇది
కొంతవరకు నిజమని నేను నమ్ముతున్నాను.
19 మీలో ఎవరు దేవుని ఆమోదం పొందారో తెలియడానికి మీ
మధ్యలో అభిప్రాయ భేదాలు ఉండవలసిందే.
20 అయితే మీరు సమావేశమైనప్పుడు మీరు తినేది ప్రభువు రాత్రి
భోజనం కాదు.
21 ఎందుకంటే, మీరు తింటున్నప్పుడు, మీలో కొందరు తమ
భోజనాన్ని ముందుగానే చేసేస్తున్నారు. దాని ఫలితంగా ఒకరు
ఆకలితో ఉండగా మరొకరు మత్తులై పోతున్నారు.

22 తినడానికి, త్రాగడానికి మీకు ఇల్లు లేవా? లేదా ఏమి లేనివారిని
అవమానించడం ద్వారా మీరు దేవుని సంఘాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారా?
నేను మీకు ఏమి చెప్పాలి? మిమ్మల్ని పొగడాలా? ఈ విషయంలో
ఖచ్చితంగా మెచ్చుకోలేను.
23 ఎందుకంటే, నేను మీకు అప్పగించిన దాన్ని ప్రభువు నుండి
పొందాను. ప్రభువైన యేసు తాను అప్పగించబడిన రాత్రి రొట్టెను
తీసుకుని,
24 కృతజ్ఞతలు చెల్లించి, దాన్ని విరిచి ఇలా అన్నారు, "ఇది మీ
కోసం ఇవ్వబడిన నా శరీరం; నన్ను జ్ఞాపకం చేసుకోవడానికి దీనిని
చేయండి."
25 అలాగే భోజనమైన తర్వాత ఆయన పాత్రను తీసుకుని, "ఈ
పాత్ర నా రక్తంతో కూడిన క్రొత్త నిబంధన, దీన్ని మీరు త్రాగిన ప్రతిసారి,
నన్ను జ్ఞాపకం చేసుకోవడానికి దీనిని చేయండి" అని చెప్పారు.
26 కాబట్టి మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగిన ప్రతిసారి
ప్రభువు వచ్చేవరకు ఆయన మరణాన్ని ప్రకటిస్తారు.
27 కాబట్టి, ఎవరైతే అయోగ్యంగా ప్రభువు రొట్టెను తిని, ఆయన
పాత్రలోనిది త్రాగుతారో వారు ప్రభువు శరీరం, ఆయన రక్తం గురించి
అపరాధులవుతారు.
28 కాబట్టి, ప్రతి ఒక్కరు ఆ రొట్టెను తినడానికి ఆ పాత్రలోనిది
త్రాగడానికి ముందు తనను తాను పరీక్షించుకోవాలి.
29 ఎందుకంటే, ఎవరైనా ప్రభువు శరీరమని వివేచించకుండా
ఆ రొట్టెను తిని, పాత్రలోనిది త్రాగితే వారు తమపైకి తామే తీర్పు
తెచ్చుకోవడానికే తిని త్రాగుతున్నారు.
30 ఈ కారణంగానే, మీలో చాలామంది వ్యాధిగ్రస్తులుగా,
బలహీనులుగా ఉన్నారు, చాలామంది మరణిస్తున్నారు.
31 కాబట్టి మనల్ని మనమే విమర్శించుకుంటే మన మీదికి తీర్పు
రాదు.
32 ప్రభువు ద్వారా మనం తీర్పు పొందినప్పుడు, అంతంలో
ఈ లోకంతో పాటు శిక్షకు గురి కాకుండా ఉండడానికి మనం

క్రమపరచబడుతున్నాము.

33 కాబట్టి, సహోదరీ సహోదరులారా! మీరు భోజనం చేయడానికి
చేరినప్పుడు మీరందరు కలిసి భోజనం చేయండి.

34 ఒకవేళ, మీరు ఒకచోట సమావేశమైనప్పుడు మీరు దేవుని
తీర్పుకు గురి కాకుండా ఎవరికైనా ఆకలిగా ఉంటే వారు ఇంటి దగ్గరే
ఏదైనా తినాలి.

నేను అక్కడికి వచ్చినపుడు మరిన్ని సూచనలు ఇస్తాను.

# 12

## ఆత్మ సంబంధమైన వరాలు

1 సహోదరీ సహోదరులారా! ఆత్మ సంబంధమైన వరాల గురించి
మీరు తెలియనివారిగా ఉండడం నాకు ఇష్టం లేదు.

2 మీరు దేవుని ఎరుగనివారిగా ఉన్నప్పుడు, ఏదో ఒకలా ప్రభావితం
చెంది మూగ విగ్రహాల దగ్గరకు తప్పుగా నడిపించబడ్డారని మీకు
తెలుసు.

3 అందువల్ల దేవుని ఆత్మచేత మాట్లాడేవారెవరూ "యేసు
శాపగ్రస్తుడు" అని చెప్పరు. పరిశుద్ధాత్మచే తప్ప మరియెవరూ
"యేసే ప్రభువు" అని అంగీకరించలేరని మీరు తెలుసుకోవాలని నేను
కోరుతున్నాను.

4 అనేక రకాలైన కృపావరాలు ఉన్నాయి కాని, వాటిని ఇచ్చే ఆత్మ
ఒక్కడే.

5 అనేక రకాలైన పరిచర్యలు ఉన్నాయి గాని, ప్రభువు ఒక్కడే.

6 అనేక రకాలైన కార్యాలు ఉన్నాయి గాని, అందరిలోను అన్నిటిని
జరిగించే దేవుడు ఒక్కడే.

7 అందరి మంచి కోసం అందరికి ఆత్మ ప్రత్యక్షత
అనుగ్రహించబడింది.

8 ఒకే ఆత్మ ఒకరికి బుద్ధి సందేశాన్ని, మరొకరికి జ్ఞాన సందేశాన్ని,

9 ఆ ఆత్మయే ఒకరికి విశ్వాసాన్ని, మరొకరికి స్వస్థత వరాన్ని
ఇస్తున్నాడు.
10 ఆత్మ ఒకరికి అద్భుతాలు చేసే శక్తిని, మరొకరికి ప్రవచన శక్తిని,
వేరొకరికి ఆత్మల వివేచన శక్తిని, మరొకరికి వివిధ భాషల్లో మాట్లాడగల
శక్తిని, వేరొకరికి ఆ భాషల అర్థాన్ని వివరించగల శక్తిని ఇస్తున్నాడు.
11 ఇవన్నీ ఒకే ఒక ఆత్మ చేస్తున్న పనులు, ఆత్మ తాను
నిర్ణయించుకున్న ప్రకారం అందరికి వాటిని పంచి ఇస్తున్నాడు.

## శరీరంలో ఏకత్వం భిన్నత్వం

12 ఒకే శరీరంలో అనేక అవయవాలు ఉన్నట్లు, అనేక అవయవాలు
కలిసి ఒక శరీరంలో ఉన్నట్లుగా క్రీస్తు కూడా ఉన్నారు.
13 అలాగే, యూదులైనా, గ్రీసు దేశస్థులైనా, యూదేతరులైనా,
దాసులైనా, స్వతంత్రులైనా, మనమందరం ఒకే శరీరంగా ఉండడానికి
ఒకే ఆత్మలో బాప్తిస్మం పొందాం, మనందరికి త్రాగడానికి ఒకే ఆత్మ
ఇవ్వబడ్డాడు.
14 శరీరం ఒకే అవయవంతో కాక అనేక అవయవాలుగా
రూపొందించబడింది.
15 "నేను చేయి కాదు కాబట్టి, నేను శరీరానికి చెందను" అని పాదం
చెప్పినంత మాత్రాన అది శరీరంలో భాగం కాకుండాపోదు.
16 "నేను కన్ను కాదు కాబట్టి, నేను శరీరానికి చెందను" అని చెవి
చెప్పినంత మాత్రాన అది శరీరంలో భాగం కాకుండాపోదు.
17 శరీరమంతా ఒక్క కన్నే అయితే అది ఎలా వినగలదు?
శరీరమంతా ఒక్క చెవే అయితే అది ఎలా వాసన తెలుసుకోగలదు?
18 అయితే నిజానికి, దేవుడు శరీర అవయవాలలో ప్రతిదాన్ని తన
ఇష్ట ప్రకారం శరీరంలో ఉంచారు.
19 అవన్నీ ఒకే అవయవమైతే ఇక శరీరం ఎక్కడ?
20 కాబట్టి అనేక అవయవాలు ఉన్నాయి కాని, శరీరం ఒక్కటే.

21 కాబట్టి, “నీతో నాకు అవసరం లేదు!” అని కన్ను చేతితో
చెప్పకూడదు. “మీతో నాకు పనిలేదు!” అని శిరస్సు పాదాలతో
చెప్పకూడదు.
22 అంతేకాక, శరీరంలో బలహీనంగా కనబడే అవయవాలు
అత్యవసరమైనవి,
23 ఏ భాగాలు ఘనతలేనివని మనం భావిస్తామో వాటికి మనం
అధిక ఘనతను ఇస్తాము. అందంగా లేని శరీరభాగాలు ప్రత్యేకమైన
శ్రద్ధను పొందగా,
24 అందంగా ఉన్న శరీర అవయవాలకు ప్రత్యేక శ్రద్ధ అవసరం
లేకపోవచ్చును. గౌరవం లేని అవయవాలకు అధిక గౌరవం
కలుగడానికి దేవుడే మన శరీరాన్ని ఒక్కటిగా చేశారు.
25 అందువల్ల శరీరంలో విభేదాలు లేవు. అయితే దానిలోని
అవయవాలన్ని పరస్పరం ఒకదానిపై ఒకటి సమానమైన శ్రద్ధను కలిగి
ఉండడానికి ఆయన అలా చేశారు.
26 ఒక్క అవయవం బాధపడితే దాంతో పాటు అన్ని అవయవాలు
బాధపడతాయి. ఒక అవయవం గౌరవం పొందితే, దాంతో పాటు
మిగిలిన అవయవాలన్ని ఆనందిస్తాయి.
27 కాబట్టి మీరందరు క్రీస్తు శరీరము. మీలో ప్రతి ఒక్కరు దానిలో
భాగాలే.
28 దేవుడు తన సంఘంలో మొదటిగా అపొస్తలులను, రెండవ
స్థానంలో ప్రవక్తలను, మూడవ స్థానంలో బోధకులను, ఆ తర్వాత
అద్భుతాలు చేసేవారిని, ఆ తర్వాత స్వస్థత వరాన్ని కలిగినవారిని,
సహాయం చేసేవారిని, మార్గదర్శకం చేసేవారిని, వివిధ భాషలు
మాట్లాడేవారిని నియమించారు.
29 అందరు అపొస్తలులా? అందరు ప్రవక్తలా? అందరు బోధకులా?
అందరు అద్భుతాలు చేయగలరా?
30 అందరికి స్వస్థత వరం కలదా? అందరు వివిధ భాషల్లో
మాట్లాడతారా? అందరు వాని అర్థాన్ని చెప్పగలరా?
31 కాబట్టి శ్రేష్ఠమైన కృపావరాలను ఆసక్తితో కోరుకోండి.

### ప్రేమ అత్యవసరమైనది

ఇదే కాకుండా, అన్నిటికంటే శ్రేష్ఠమైన మార్గాన్ని నేను మీకు చూపిస్తాను.

# 13

1 మానవుల లేదా దేవదూతల భాషలు నేను మాట్లాడ కలిగినా,
నాకు ప్రేమ లేకపోతే కేవలం మ్రోగే గంటలా గణగణ మ్రోగించే తాళంలా
ఉంటాను.
2 నేను ప్రవచన వరాన్ని కలిగినా, అన్ని రహస్యాలను అర్థం
చేసికోగలిగినా, సమస్త జ్ఞానం కలిగి ఉన్నా, పర్వతాలను కూడా
కదిలించగల గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉన్నా, నాలో ప్రేమ లేకపోతే నేను
వ్యర్థమే.
3 నాకున్న సంపాదనంతా పేదలకు ఇచ్చివేసి, మెప్పు కోసం నా
శరీరాన్ని కష్టానికి అప్పగించినా నాలో ప్రేమ లేకపోతే నాకు ప్రయోజనం
ఏమి లేదు.
4 ప్రేమే సహనం, ప్రేమే దయ, అది అసూయ లేనిది, అది
హెచ్చించుకోదు, గర్వం లేనిది.
5 అది ఇతరులను అగౌరపరచదు, స్వార్థం లేనిది, త్వరగా
కోప్పడదు, తప్పులను జ్ఞాపకం ఉంచుకోదు.
6 ప్రేమ చెడుతనంలో ఆనందించదు కాని సత్యంలో ఆనందిస్తుంది.
7 అది అన్నిటిని కాపాడుతుంది, అన్నిటిని నమ్ముతుంది, అన్నిటిని
నిరీక్షిస్తుంది, అన్నిటిని సహిస్తుంది.
8 ప్రేమ ఎప్పుడు విఫలం కాదు. అయితే ప్రవచనాలు ఆగిపోతాయి,
భాషలైనా నిలిచిపోతాయి, జ్ఞానం గతించిపోతుంది.
9 ఎందుకంటే మనకు తెలిసింది కొంచెమే, మనం ప్రవచించేది
కొంతవరకే.
10 కాని సంపూర్ణమయింది వచ్చినప్పుడు అసంపూర్ణమైనవి
గతించిపోతాయి.

11 నేను చిన్నబిడ్డగా ఉన్నపుడు చిన్నబిడ్డగా మాట్లాడాను,
చిన్నబిడ్డగా తలంచాను, చిన్నబిడ్డగా ఆలోచించాను, కాని నేను
పెద్దవాన్ని అయినప్పుడు బాల్యపు పద్ధతులు వదిలేశాను.
12 ఇప్పుడు మనం చూస్తున్నది కేవలం అద్దంలో కనబడే
ప్రతిబింబమే; కాని తర్వాత ముఖాముఖిగా చూస్తాము.
ఇప్పుడు నాకు తెలిసింది కొంతమాత్రమే, తర్వాత నేను పూర్తిగా
తెలుసుకోబడిన ప్రకారం నేను పూర్తిగా తెలుసుకుంటాను.
13 విశ్వాసం, నిరీక్షణ, ప్రేమ అనే ఈ మూడు నిలిచి ఉంటాయి.
వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమే.

# 14

## ఆరాధనలో స్పష్టత

1 ప్రేమ చూపడానికి ప్రయాసపడండి, ఆత్మ వరాలను ఆసక్తితో
కోరుకోండి. మరి ముఖ్యంగా ప్రవచన వరాన్ని ఆశించండి.
2 భాషల్లో మాట్లాడేవారు మానవులతో కాదు కాని దేవునితో
మాట్లాడతారు. ఎవరూ వాటిని అర్థం చేసుకోలేరు; ఆత్మ ద్వారా వారు
రహస్యాలను పలుకుతున్నారు.
3 అయితే ప్రవచించేవారు మానవులను బలపరచడానికి,
ప్రోత్సాహం, ఆదరణ కలిగించడానికి వారితో మాట్లాడుతున్నారు.
4 భాషల్లో మాట్లాడేవారు తనకు తానే జ్ఞానాభివృద్ధి చేసుకుంటారు,
కాని ప్రవచించేవారు సంఘానికి అభివృద్ధి కలుగజేస్తారు.
5 మీరందరు భాషల్లో మాట్లాడాలని నా కోరిక కాని, మీరు
ప్రవచించాలని మరి ఎక్కువగా కోరుతున్నాను. భాషల్లో మాట్లాడేవారు
తెలిపిన దానికి సంఘం అభివృద్ధి చెందేలా మరొకరు అర్థం చెప్తేనే
తప్ప, భాషల్లో మాట్లాడేవారి కంటే ప్రవచించేవారే గొప్పవారు.
6 కాబట్టి సహోదరీ సహోదరులారా, నేను మీ దగ్గరకు వచ్చి
సత్యాన్ని తెలియజేయడం గాని జ్ఞానం గాని ప్రవచనం గాని వాక్య బోధ

గాని మీకు చెప్పకపోతే నేను వచ్చి భాషల్లో మాట్లాడడం వల్ల నా నుండి
మీకు ఏ మంచి జరుగుతుంది?
7 వేణువు, వీణ వంటి జీవంలేని వాయిద్యాలను
వాయించినప్పుడు వాటి స్వరాల్లో భేదం లేకపోతే ఏది ఏ వాయిద్యమో
ఎలా తెలుసుకోగలరు?
8 అంతేకాక, బూర ఊదేవారు స్పష్టమైన ధ్వని చేయకపోతే
యుద్ధానికి ఎవరు సిద్ధపడతారు?
9 అలాగే మీరు నాలుకతో స్పష్టమైన మాటలు మాట్లాడకపోతే మీరు
ఏమి మాట్లాడుతున్నారో ఎవరైనా ఎలా తెలుసుకోగలరు? అప్పుడు
మీరు కేవలం గాలిలో మాట్లాడినట్లు ఉంటుంది.
10 లోకంలో చాలా భాషలు ఉన్నాయి, అవన్నీ అర్థాన్ని కలిగి
ఉన్నాయని అనడంలో సందేహం లేదు.
11 ఎవరైనా మాట్లాడినప్పుడు దాని అర్థాన్ని నేను గ్రహించలేకపోతే
మాట్లాడేవారికి నేను, నాకు మాట్లాడేవారు పరాయివానిగా ఉంటాను.
12 ఆత్మ సంబంధమైన వరాలు పొందాలన్న ఆసక్తి మీలో ఉంది
కాబట్టి సంఘాన్ని బలపరచడానికి వాటిని సమృద్ధిగా పొందే ప్రయత్నం
చేయండి.
13 భాషలో మాట్లాడేవారు తాము మాట్లాడిన దానికి అర్థం చెప్పే శక్తి
కోసం ప్రార్థించాలి.
14 ఎందుకంటే, నేను భాషలో ప్రార్థిస్తే, నా ఆత్మ కూడా ప్రార్థిస్తుంది
కాని నా మనస్సు ఫలవంతంగా ఉండదు.
15 కాబట్టి నేను ఏమి చేయాలి? నా ఆత్మతో ప్రార్థిస్తాను, అయితే
నా జ్ఞానంతో కూడ ప్రార్థిస్తాను. నా ఆత్మతో పాడతాను, నా మనసుతో
కూడా పాడతాను.
16 లేకపోతే మీరు ఆత్మలో దేవునికి కృతజ్ఞత చెల్లిస్తే, మీరు చెప్పిన
దాన్ని గ్రహించలేనివారు అక్కడ ఉంటే, మీరు ఏం చెప్పారో వారికి
తెలియదు కాబట్టి మీ కృతజ్ఞతా స్తుతికి వారు “ఆమేన్” అని ఎలా
చెప్తారు?

17 నీవు చక్కగానే దేవునికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నావు కాని
దానివల్ల ఎవరికి జ్ఞానవృద్ధి కలుగదు.

18 మీ అందరికంటే నేను ఎక్కువగా భాషల్లో మాట్లాడుతున్నందుకు
దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.
19 కాని, సంఘంలో అర్థం చేసుకోలేని భాషలో పదివేల మాటలు
మాట్లాడడం కంటే, ఇతరులకు బోధించడానికి అర్థమైన అయిదు
మాటలు నేను మాట్లాడితే మంచిది.

20 సహోదరీ సహోదరులారా, పసిబిడ్డల్లా ఆలోచించడం ఆపండి.
చెడు విషయంలో పసివారిలా ఉండండి కాని ఆలోచించడంలో
పెద్దవారిలా ఉండండి.
21 ధర్మశాస్త్రంలో ఇలా వ్రాయబడి ఉంది:

“ఇతర భాషలతో
పరదేశీయుల పెదాలతో
నేను ఈ ప్రజలతో మాట్లాడతాను,
కాని వారు నా మాట వినరు,
అని ప్రభువు పలుకుతున్నాడు.”*

22 కాబట్టి భాషలతో మాట్లాడడం అనేది విశ్వాసులకు కాదు
అవిశ్వాసులకే సూచన. అయితే ప్రవచించడం అవిశ్వాసులకు కాదు
విశ్వాసులకే సూచన.
23 ఒకవేళ సంఘమంతా ఒకచోట చేరి అందరు భాషల్లో
మాట్లాడుతున్నప్పుడు గ్రహించలేనివారు గాని అవిశ్వాసులు
గాని లోపలికి వస్తే, మీరందరు పిచ్చివారిలా మాట్లాడుతున్నారని
అనుకుంటారు కదా?
24 కాని, అందరు ప్రవచిస్తే అవిశ్వాసి కాని, తెలియనివారు కాని
లోపలికి వస్తే తాము విన్నదానిని బట్టి వారు తాము పాపులమని
గ్రహించి అందరిని బట్టి వారు తీర్పుపొందుతారు.

* **14:21** యెషయా 28:11,12

25 వారి హృదయ రహస్యాలు బయలుపరచబడతాయి. వారు
సాగిలపడి దేవున్ని ఆరాధిస్తూ, “దేవుడు నిజంగా మీ మధ్యలో
ఉన్నాడు!” అని అంగీకరిస్తారు.

## ఆరాధనలో మంచి క్రమం

26 సహోదరీ సహోదరులారా, మేము ఇక ఏమి చెప్పాలి?
మీరు సమావేశమైనప్పుడు, మీలో ఒకరు కీర్తన పాడాలని, ఒకరు
బోధించాలని, ఒకరు దేవుడు బయలుపరచిన దాన్ని ప్రకటించాలని,
ఒకరు భాషలతో మాట్లాడాలని, ఒకడు దానికి అర్థం చెప్పాలని
తలస్తున్నారు. కాని ఇవన్నీ సంఘాన్ని బలపరచడానికి చేయండి.
27 భాషల్లో మాట్లాడాలనుకున్నవారు ఇద్దరు లేదా ముగ్గురు
మాత్రమే ఒకరి తర్వాత ఒకరు మాట్లాడాలి. మరొకరు దాని అర్థాన్ని
వివరించాలి.
28 అయితే అర్థాన్ని వివరించగలవారు ఎవరూ లేకపోతే, భాషలు
మాట్లాడేవారు సంఘంలో మౌనంగా ఉండి, తనలో తాను దేవునితోను
మాత్రమే మాట్లాడుకోవాలి.
29 ప్రవక్తల్లో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే మాట్లాడాలి. ఇతరులు
వారు చెప్పిన దానిని జాగ్రత్తగా వివేచించాలి.
30 సమావేశంలో కూర్చున్నవారిలో ఎవరైనా దేవుని నుండి
ప్రత్యక్షతను పొందితే, మాట్లాడుతున్నవారు తన మాటలు
ఆపివేయాలి.
31 ప్రతి ఒక్కరు నేర్చుకోవడానికి ప్రోత్సహించబడేలా మీరందరు
ఒకరి తర్వాత ఒకరు ప్రవచించాలి.
32 ప్రవక్తల ఆత్మ ప్రవక్తలకు లోబడి ఉండాలి.
33 అలాగే పరిశుద్ధుల సంఘాలన్నిటిలో దేవుడు సమాధానాన్ని
కలిగిస్తారే తప్ప అల్లరిని కాదు.
34 స్త్రీలు సంఘాల్లో మౌనంగా ఉండాలి. వారు మాట్లాడడానికి
అనుమతి లేదు కాని ధర్మశాస్త్రంలో చెప్పబడినట్లుగా వారు వినయం
కలిగి ఉండాలి.

35 వారు ఏదైనా తెలుసుకోవాలంటే ఇంటి దగ్గర తమ భర్తలను
అడగాలి; సంఘంలో మాట్లాడడం స్త్రీకి అవమానకరం.

36 దేవుని వర్తమానం మీ నుండే మొదలైనదా? లేదా అది మీ
దగ్గరకు మాత్రమే వచ్చిందా?
37 ఎవరైనా తాము దేవుని ప్రవక్తలమని లేదా ఆత్మ వరాలు గల
వారమని తలిస్తే, నేను మీకు వ్రాసేది ప్రభువు ఆజ్ఞ అని వారు
గ్రహించాలి.
38 కాని, ఎవరైనా దీన్ని నిర్లక్ష్యం చేస్తే, వారు నిర్లక్ష్యం
చేయబడినవారిగానే ఉంటారు.
39 కాబట్టి నా సహోదరీ సహోదరులారా, ప్రవచించడాన్ని ఆసక్తితో
కోరుకోండి, భాషలతో మాట్లాడడాన్ని ఆటంకపరచకండి.
40 అయితే సమస్తం మర్యాదగా క్రమంగా జరుగనివ్వండి.

# 15

## క్రీస్తు పునరుత్థానం

1 సహోదరీ సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను
మీరు అంగీకరించి దానిలో నిలిచి ఉండాలని మీకు జ్ఞాపకం
చేస్తున్నాను.
2 నేను మీకు బోధించిన విధంగా మీరు దానికి గట్టిగా
అంటిపెట్టుకుని ఉంటే ఈ సువార్తను బట్టి మీరు రక్షించబడతారు.
లేకపోతే మీరు నమ్మడం వ్యర్థమే.

3 నేను పొందిన దానిని మొదట మీకు ప్రకటించాను: అది ఏంటంటే
లేఖనాల ప్రకారం క్రీస్తు మన పాపాల కోసం మరణించారు.
4 లేఖనాల ప్రకారం ఆయన సమాధి చేయబడి, మూడవ దినాన
సజీవునిగా లేచారు.
5 ఆయన కేఫాకు, తర్వాత పన్నెండు మందికి కనబడ్డారు.

6 దాని తర్వాత ఆయన ఒకేసారి అయిదువందల మందికి పైగా
సహోదర సహోదరీలకు కనబడ్డారు. వారిలో కొందరు మరణించినా
చాలామంది ఇంకా జీవించే ఉన్నారు.
7 ఆ తర్వాత యాకోబుకు, మిగిలిన అపొస్తలులందరికి ఆయన
కనబడ్డారు.
8 అందరికంటే చివరిగా అకాలంలో పుట్టిన నాకు కూడా ఆయన
కనబడ్డారు.
9 అపొస్తలులందరిలో నేను అల్పమైనవాన్ని. నేను దేవుని
సంఘాన్ని హింసించిన కారణంగా అపొస్తలుడని పిలువబడడానికి
యోగ్యున్ని కాను.
10 అయితే నేనేమై ఉన్నానో అది దేవుని కృప వలన మాత్రమే,
ఆయన కృప నాలో వ్యర్థం కాలేదు. పైగా ఇతర అపొస్తలుల కంటే నేను
ఎంతో ఎక్కువగా శ్రమపడ్డాను కాని అది నిజంగా నా ప్రయాస కాదు,
నాకు తోడుగా ఉన్న దేవుని కృపయే.
11 కాబట్టి నేనైనా వారైనా దానినే ప్రకటిస్తున్నాం, దానినే మీరు
నమ్మారు.

## మృతుల పునరుత్థానం

12 మృతులలో నుండి క్రీస్తు సజీవంగా లేపబడ్డారని మేము
ప్రకటిస్తుండగా, మృతుల పునరుత్థానం లేదని మీలో కొందరు ఎలా
చెప్తారు?
13 మృతుల పునరుత్థానం లేకపోతే క్రీస్తు కూడా లేపబడనట్టే కదా.
14 అంతేకాదు క్రీస్తు లేపబడకపోతే, మా బోధ వ్యర్థమే, మీ విశ్వాసం
కూడా వ్యర్థమే.
15 అంతేకాక, దేవుడు క్రీస్తును మరణం నుండి లేపారని
దేవుని గురించి చెప్పిన సాక్ష్యాన్ని బట్టి మేము అబద్ధ సాక్షులంగా
కనబడుతున్నాము. అయితే దేవుడు ఆయనను లేపకపోతే
మరణించినవారు లేపబడరు అనేది నిజం కదా.
16 మృతులు లేపబడకపోతే క్రీస్తు కూడా లేపబడలేదు.

17 క్రీస్తు లేపబడకపోతే మీ విశ్వాసం వ్యర్థమే; మీరు ఇంకా మీ
పాపాల్లోనే ఉన్నారు.
18 అంతేకాక క్రీస్తులో మరణించినవారు కూడా నశించినట్లే.
19 కేవలం ఈ జీవితకాలం వరకే క్రీస్తులో మన నిరీక్షణ ఉంచితే,
అందరికంటే మనం అత్యంత దయనీయంగా ఉంటాము.
20 ఇప్పుడైతే మరణించినవారిలో ప్రథమ ఫలంగా క్రీస్తు మరణం
నుండి లేపబడ్డారు.
21 ఒక్క మనుష్యుని ద్వారా మరణం వచ్చింది కాబట్టి మృతుల
పునరుత్థానం కూడ ఒక్క మనుష్యుని ద్వారానే వస్తుంది.
22 ఆదాములో అందరు ఎలా మరణించారో అలాగే క్రీస్తులో అందరు
బ్రతికించబడతారు.
23 అయితే ప్రతి ఒక్కరు తమ క్రమాన్ని బట్టి బ్రతికించబడతారు.
క్రీస్తు ప్రథమ ఫలము. తర్వాత ఆయన వచ్చినప్పుడు ఆయనకు
చెందినవారు బ్రతుకుతారు.
24 క్రీస్తు సమస్త ఆధిపత్యాన్ని అధికారాన్ని బలాన్ని నాశనం చేసి
తండ్రియైన దేవునికి రాజ్యానికి అప్పగిస్తారు. అప్పుడు అంతం
వస్తుంది.
25 ఎందుకంటే ఆయన తన శత్రువులందరిని తన పాదాల క్రింద
ఉంచేవరకు ఆయన పరిపాలిస్తారు.
26 చివరిగా నశించే శత్రువు మరణం.
27 “దేవుడు సమస్తాన్ని క్రీస్తు పాదాల క్రింద ఉంచారు”* అని
చెప్పినప్పుడు ఆయన క్రింద సమస్తాన్ని ఇచ్చిన దేవుడు మినహా
మిగిలిన వాటన్నిటిని ఆయన క్రింద ఉంచారని అర్థం.
28 ఆయన ఇది చేసినప్పుడు, దేవుడే అన్నిటిలో సర్వమై ఉండేలా,
కుమారుడు తనకు సమస్తాన్ని లోబరచిన దేవునికి తానే లోబడతారు.
29 ఇప్పుడు పునరుత్థానం లేకపోతే, మరి మృతుల కోసం
బాప్తిస్మం పొందినవారు ఏం చేస్తారు? మరణించినవారు

* **15:27** కీర్తన 8:6

ఎన్నటికి లేపబడకపోతే, ప్రజలు వారి కోసం ఎందుకు బాప్తిస్మం
పొందుతున్నారు?
30 మరి అనుక్షణం మేము ఎందుకు ప్రాణభయంతో ఉండాలి?
31 సహోదరీ సహోదరులైన మీ గురించి మన ప్రభువైన యేసు
క్రీస్తులో నాకు అతిశయం కలుగుతున్నట్టుగానే నేను ప్రతి రోజూ
చస్తూనే ఉన్నాను.
32 కాని, కేవలం మానవరీతిగా ఎఫెసులోని మృగాలతో
నేను పోరాడితే నాకు లాభమేంటి? ఒకవేళ మరణించినవారు
లేపబడకపోతే,

"రేపు చనిపోతాం కాబట్టి,
మనం తిని త్రాగుదాం."†

33 మోసపోకండి: "దుష్టులతో సహవాసం మంచి ప్రవర్తనను
పాడుచేస్తుంది."
34 మీరు నీతిప్రవర్తన కలిగి పాపం చేయకండి. మీలో కొందరికి దేవుని
గురించి తెలియదు కాబట్టి, మీరు సిగ్గుపడాలని ఇలా చెప్తున్నాను.

## పునరుత్థాన శరీరం

35 "చనిపోయినవారు ఎలా లేపబడతారు? వారికి ఎలాంటి శరీరం
ఉంటుంది?" అని ఎవరైనా ప్రశ్నించవచ్చు.
36 మూర్ఖుడా! నీవు ఒక విత్తనాన్ని భూమిలో నాటినప్పుడు అది
చనిపోతేనే తప్ప మొలకెత్తదు.
37 గోధుమ గింజనైన, మరొక దానినైన నీవు భూమిలో
నాటినప్పుడు విత్తనం మాత్రమే నాటావు గాని పెరిగిన మొక్క కాదు.
38 అయితే దేవుడు తాను నిర్ణయించిన శరీరాన్ని దానికి ఇస్తారు.
ఆయన ప్రతి ఒక్క గింజకు దాని సొంత శరీరాన్ని ఇస్తారు.
39 శరీరాలన్ని ఒకేలా ఉండవు. మానవుల మాంసం వేరు,
జంతువుల మాంసం వేరు, పక్షుల మాంసం వేరు, చేపల మాంసం
వేరు.

† **15:32** యెషయా 22:13

40 అలాగే ఆకాశ శరీరాలు ఉన్నాయి, భూలోక శరీరాలు ఉన్నాయి;
ఆకాశ శరీరాల మహిమ వేరు, భూశరీరాల మహిమ వేరు.
41 సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రాల
మహిమ వేరు. ఒక నక్షత్రానికి మరొక నక్షత్రానికి మహిమలో భేదం
ఉంటుంది.
42 మృతుల పునరుత్థానం కూడా ఇలాగే ఉంటుంది. నశించిపోయే
శరీరం నాటబడి నాశనంలేనిదిగా లేపబడుతుంది.
43 ఘనహీనంగా విత్తబడి మహిమగలదిగా లేపబడుతుంది; అది
బలహీనమైనదిగా విత్తబడి శక్తిగలదానిగా లేపబడుతుంది.
44 ప్రకృతి సంబంధమైన శరీరంగా విత్తబడి ఆత్మీయ శరీరంగా
లేపబడుతుంది.
ప్రకృతి సంబంధమైన శరీరం ఉన్నట్లే ఆత్మీయ శరీరం కూడ ఉంది.
45 కాబట్టి "మొదటి మనిషియైన ఆదాము జీవి అయ్యాడు"‡ అని
వ్రాయబడింది; చివరి ఆదాము జీవాన్నిచ్చే ఆత్మ అయ్యాడు.
46 ఆత్మ సంబంధమైనది మొదట రాలేదు, కాని ప్రకృతి
సంబంధమైనది మొదట వచ్చింది, ఆ తర్వాతే ఆత్మ సంబంధమైనది
వచ్చింది.
47 మొదటి మానవుడు భూమిలోని మట్టితో చేయబడ్డాడు, రెండవ
మానవుడు పరలోకానికి చెందిన వాడు.
48 భూమికి చెందిన మానవునిలా భూలోక సంబంధులు ఉంటారు.
పరలోకానికి చెందిన వానిలా పరలోక సంబంధులు ఉంటారు.
49 మనం భూసంబంధియైన మనుష్యుని రూపాన్ని ధరించినట్లే
పరలోకసంబంధమైన వాని రూపాన్ని ధరించుకుంటాము.
50 సహోదరీ సహోదరులారా, నేను మీకు చెప్పేది ఏంటంటే,
రక్తమాంసాలు దేవుని రాజ్య వారసత్వాన్ని పొందలేవు.
నశించిపోయేది శాశ్వతమైన దానిని స్వతంత్రించుకోలేదు.
51 నేను మీకు ఒక రహస్యాన్ని చెప్తాను వినండి: మనమందరం
నిద్రించం గాని, మనమందరం మార్పు చెందుతాము.

‡ **15:45** ఆది 2:7

52 ఒక క్షణంలోనే, రెప్పపాటులో, చివరి బూర మ్రోగగానే
మనమందరం మార్పు పొందుతాము. బూర మ్రోగుతుంది, అప్పుడు
మృతులు శాశ్వతమైనవారిగా లేపబడతారు, మనమందరం మార్పు
చెందుతాము.
53 ఎందుకంటే, నశించిపోయేది శాశ్వతమైన దాన్ని ధరించుకోవాలి,
మరణించేది మరణంలేని దాన్ని ధరించుకోవాలి.
54 నశించిపోయేది శాశ్వతమైన దాన్ని, మరణించేది మరణంలేని
దాన్ని ధరించినపుడు, "విజయం మరణాన్ని మ్రింగివేసింది"§ అని
వ్రాయబడిన వాక్యం నిజమవుతుంది.
55 "ఓ మరణమా, నీ విజయం ఎక్కడ?
ఓ మరణమా, నీ ముల్లు ఎక్కడ?"*
56 మరణపు ముల్లు పాపం, పాపానికున్న బలం ధర్మశాస్త్రమే.
57 అయితే దేవునికి కృతజ్ఞతలు! మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా
ఆయన మనకు విజయాన్ని ఇచ్చారు.
58 కాబట్టి నా ప్రియ సహోదరీ సహోదరులారా, స్థిరంగా నిలబడండి.
ఏది మిమ్మల్ని కదపలేదు. ప్రభువులో మీ శ్రమ వ్యర్థం కాదని మీకు
తెలుసు కాబట్టి ఎల్లప్పుడు ప్రభువు కార్యాల్లో పూర్తి శ్రద్ధ చూపండి.

# 16

## పరిశుద్ధుల కోసం కానుక సేకరించుట

1 ప్రభువు ప్రజల కోసం కానుక పోగుచేయడం గురించి
గలతీయలోని సంఘాలకు నేను ఏమి చేయమని చెప్పానో మీరు
కూడా అది చేయాలి.
2 ప్రతి వారంలో మొదటి రోజున మీలో ప్రతి ఒక్కరు మీ సంపాదన
బట్టి కొంత ధనాన్ని ప్రక్కన పెట్టి దాచి ఉంచండి. దానివల్ల నేను
వచ్చినపుడు కానుకలు సేకరించాల్సిన అవసరం ఉండదు.

§ **15:54** యెషయా 25:8 * **15:55** హోషేయ 13:14

3 నేను వచ్చిన తర్వాత, మీరు ఆమోదించిన వారికి నేను
పరిచయ పత్రికలను ఇచ్చి, మీ కానుకలతో వారిని యెరూషలేముకు
పంపుతాను.
4 నేను కూడా వెళ్లడం అవసరం అయితే, వారు నా వెంట వస్తారు.

## వ్యక్తిగత విజ్ఞాపనలు

5 నేను మాసిదోనియాకు వెళ్లాలని అనుకుంటున్నాను కాబట్టి
మాసిదోనియాకు వెళ్లినప్పుడు మీ దగ్గరకు వస్తాను.
6 బహుశ మీతో కొంతకాలం గడుపుతాను లేదా చలికాలమంతా
ఉంటాను. అప్పుడు నేను ఎక్కడికి వెళ్తానో అక్కడికి నా ప్రయాణంలో
మీరు నాకు సహాయం చేయగలరు.
7 మార్గమధ్యలో మిమ్మల్ని చూసి వెంటనే వెళ్లిపోవాలని నేను
అనుకోవడం లేదు. ప్రభువు అనుమతిస్తే మీతో కొంతకాలం గడపాలని
అనుకుంటున్నాను.
8 అయితే పెంతెకొస్తు దినం వరకు ఎఫెసులోనే ఉంటాను.
9 ఎందుకంటే చాలామంది నన్ను వ్యతిరేకించినా, ఫలవంతమైన
పని చేయడానికి ఒక గొప్ప ద్వారం నాకు తెరవబడింది.
10 తిమోతి వచ్చినప్పుడు అతడు మీ దగ్గర నిర్భయంగా ఉండేలా
చూడండి. నాలాగే అతడు కూడా ప్రభువు పని చేస్తున్నాడు.
11 కాబట్టి ఎవరూ అతని పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించవద్దు. అతడు
నా దగ్గరకు తిరిగి వచ్చేలా అతన్ని సమాధానంతో పంపించండి.
అతడు సహోదరులతో పాటు వస్తాడని నేను ఎదురు చూస్తున్నాను.
12 మన సహోదరుడైన అపొల్లో విషయం ఏంటంటే, సహోదరులతో
పాటు మీ దగ్గరకు వెళ్లమని అతన్ని నేను చాలా బ్రతిమాలాను. కాని
ఇప్పుడే బయలుదేరడం అతనికి ఏమాత్రం ఇష్టం లేదు. అయితే
సరియైన అవకాశం లభించినపుడు అతడు వస్తాడు.
13 మెలకువగా ఉండండి; విశ్వాసంలో నిలకడగా ఉండండి; ధైర్యం
కలిగి బలవంతులై ఉండండి.
14 ప్రేమ పూర్వకంగా అన్ని పనులు చేయండి.

15 స్తెఫెను అతని ఇంటివారు అకాయలో మొదటిగా క్రీస్తును
స్వీకరించారని మీకు తెలుసు. వారు పరిశుద్ధుల సేవకు తమను
తాము అర్పించుకున్నారు. సహోదరీ సహోదరులారా, మిమ్మల్ని
బ్రతిమాలుతున్నాను,
16 అలాంటి వారికి, వారితో పాటు పని చేసి సేవ చేసేవారికి మీరు
లోబడి ఉండండి.
17 స్తెఫెను, ఫొర్తూనాతు అకాయికు అనేవారు రావడం నాకు
సంతోషం ఎందుకంటే మీరు లేని కొరత వారు నాకు తీర్చారు.
18 నా ఆత్మకు, మీ ఆత్మకు కూడా వారు నూతన ఉత్తేజం
కలిగించారు. అలాంటివారు గౌరవించదగినవారు.

### చివరి అభినందనలు

19 ఆసియా ప్రాంతంలోని సంఘాలు మీకు తమ అభినందనలు
పంపుతున్నారు.
అకుల, ప్రిస్కిల్ల అనేవారు, వారి ఇంట్లో సమావేశమయ్యే సంఘం
మీకు ప్రభువులో హృదయపూర్వక అభినందనలు పంపుతున్నారు.
20 ఇక్కడి సహోదరీ సహోదరులందరు మీకు అభినందనలు
పంపుతున్నారు.
పవిత్రమైన ముద్దు పెట్టుకొని ఒకరిని ఒకరు అభినందనలు
తెలుపుకోండి.

21 పౌలు అనే నేను నా స్వహస్తంతో ఈ శుభములు వ్రాస్తున్నాను.

22 ప్రభువును ప్రేమించనివారు శపింపబడును గాక! ప్రభువా రండి!

23 ప్రభువైన యేసు కృప మీతో ఉండును గాక.

24 క్రీస్తు యేసులో మీ అందరికి నా ప్రేమను తెలియజేస్తున్నాను.
ఆమేన్.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.
You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."
Notice of copyright must appear on the title or copyright page of the work as follows:
Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.
"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.
You must also make your derivative work available under the same license (CC BY-SA).
If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6